నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
నిజామాబాద్-కామారెడ్డి
1
శుక్రవారం | ఫిబ్రవరి 21, 2025 | www.navatelangana.com

బాలికపై లైంగిక దాడి..?



నవతెలంగాణ-రామారెడ్డి
బాలికపై లైంగిక దాడి జరిగిన ఘటన బుధవారం రాత్రి చోటుచేసుకుంది. పోలీసులు, స్థానికుల వివరాల ప్రకారం.. మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాలికపై కన్నాపూర్ గ్రామానికి చెందిన గుజ్జుల నవీన్ అనే యువకుడు బాలికను నిర్మానుష్య ప్రాంతానికి తీసుకెళ్లి లైంగిక దాడికి పాల్పడినట్లు బాలిక కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. బాలికను పరీక్షల నిమిత్తం కామారెడ్డి సఖి సెంటర్‌కు తరలించారు. నిందితుడు పోలీసుల అదుపులో ఉన్నట్టు తెలుస్తోంది.

నీటి నాణ్యతపై సదస్సు

నవతెలంగాణ-రెంజల్
భూగర్భ జలశాఖ నిజామాబాద్ జిల్లా వారి ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని ఎంపిడిఓ కార్యాలయం సంచార నీటి నాణ్యత ప్రయోగశాలలో నీటి నాణ్యత అవగాహన సదస్సు గురువారం నిర్వహించారు. వ్యవసాయదారులు, విద్యార్థులు, భూగర్భజల వినియోగదారులు పాల్గొన్నారు. వారికి నీటి నాణ్యతపై సందేహాలను నివృత్తి చేశారు. ప్రత్యక్షంగా వారు తెచ్చిన నీటి నమూనాలను నాణ్యత ప్రయోగశాల ద్వారా పరీక్షించి నీటి నాణ్యత వివరాలు తెలియజేశారు. ఈ సమావేశంలో జిల్లా భూగర్భ జల శాఖ ఉపసంచాలకులు పి.శ్రీనివాసుబాబు, ఎంపీడీవో వెంకటేష్, జడ్పీహెచ్ఎస్ పాఠశాల ఉపాధ్యాయులు గంగాధర్, నరేందర్, నామ్దేవ్, సహాయక భూభౌతిక శాస్త్రవేత్త నికత్ పర్వీన్, సహాయక భూగర్భజల శాస్త్రవేత్త టి.హరీష్, ఏ.సాయిలు, జెడ్పిహెచ్ఎస్ విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

త్వరగా ప్రారంభించేనా..?

చేతికొచ్చిన జొన్న పంట.. గతేడాది కొనుగోలు కేంద్రాలు ఆలస్యంగా ప్రారంభం

- అకాల వర్షాలతో నష్టపోయిన అన్నదాతలు
- ఈసారి త్వరగా ప్రారంభించాలని వేడుకోలు

నవతెలంగాణ-పెద్దకొడప్‌గల్
మండలంతో పాటు పరిసర ప్రాంత గ్రామాలలో యాసంగి పంటలో భాగంగా అధిక సంఖ్యలో రైతులు జొన్న పంటను సాగు చేశారు. అయితే ప్రస్తుతం పంట చేతికొచ్చింది. గత సంవత్సరం జొన్న కొనుగోళ్లను త్వరగా ప్రారంభించకపోవడంతో రైతులు అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారు. గతేడాది ఏప్రిల్ నెల చివరలో జొన్న కొనుగోళ్లు ప్రారంభించగా.. ఆ సమయంలో అకాల వర్షాలకు సొసైటీలో, మార్కెట్ యార్డ్‌లో, రైతుల కల్లాల్లో నిల్వ ఉంచిన జొన్న పంట తడిసి నల్లబడిపోయింది. దీంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. ఈ సారైనా కొనుగోలు కేంద్రాలను త్వరగా ప్రారంభించాలని రైతులు కోరుతున్నారు.

అయితే ఈ యేడు దాదాపు మండలంలో రెండున్నర వేల ఎకరాల నుంచి మూడు వేల ఎకరాల వరకు జొన్న పంట రైతులు సాగు చేసినట్టు అంచనా. జొన్న కొనుగోళ్లను మార్చ్ మొదటి వారంలో ప్రారంభిస్తే రైతులకు ఎటువంటి ఇబ్బందులు ఉండవని.. ఏప్రిల్ చివరి వారంలో జొన్న కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయడంతో ఒకేసారి అందరూ రైతులు కొనుగోలు కేంద్రాలకు రావడంతో సకాలంలో జొన్నలు తూకం కాకపోవడం, ఒకవేళ తూకమైనా ధాన్యం లారీలు లోడ్ కాకపోవడం వల్ల అనేక ఇబ్బందులు ఎదుర్కో వాల్సి వస్తుందని రైతులు అంటు న్నారు. అలాగే అకాల వర్షాలు పడితే జొన్నలు నల్లబడడంతో ప్రభుత్వం కొనుగోలు చేయడానికి నిరాకరిస్తుందని, కాబట్టి ఈ సంవత్సరమైన తొందరగా కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి జొన్న రైతులను ఆదుకోవాలని రైతులు ప్రభుత్వాన్ని వేడుకుంటున్నారు.



జొన్న పంట నూర్పిడి



తూకం వేసి సొసైటీలో నిల్వ ఉంచిన జొన్న బస్తాలు

అంబేద్కర్ విగ్రహం ఎదుట ఛత్రపతి శివాజీ ఫ్లెక్సీ ఏర్పాటు

- ఎస్సీ, బీసీ కులాల మధ్య గొడవ
- పోలీసుల పికెటింగ్‌తో ప్రశాంతత

నవతెలంగాణ-భీంగల్ రూరల్
నిజామాబాద్ జిల్లా భీంగల్ మండలంలోని బడా భీంగల్ గ్రామంలో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి ఎదురుగా బీసీ కులానికి చెందిన సభ్యులు శివాజీ ఫ్లెక్సీని ఏర్పాటు చేయడంతో రెండు కులాల మధ్య గొడవ చోటుచేసుకుంది. దీంతో పోలీసులు గురువారం పికెటింగ్ ఏర్పాటు చేశారు. వివరాల్లోకి వెళ్తే.. ఛత్రపతి శివాజీ జయంతి సందర్భంగా గ్రామంలోని ప్రధాన చౌరస్తాలోని అంబేద్కర్ విగ్రహానికి ఎదురుగా గ్రామానికి చెందిన బీసీ కులస్తులు బుధవారం ఛత్రపతి శివాజీ ఫ్లెక్సీని ఏర్పాటు చేశారు. దాని పక్కనే మరో చిత్రపటం ఏర్పాటు చేసి నివాళులర్పించారు. దీంతో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి అడ్డుగా ఉన్న ఫ్లెక్సీని తొలగించాలని మాల, మాదిగ కులస్తులు బడా భీంగల్ గ్రామాభివృద్ధి కమిటీకి బుధవారం విన్నవించారు. దీంతో వీడీసీ బీసీ కులాలకు సూచించినా వారు వినలేదు. మాల మాదిగ కుల సంఘం సభ్యులు పోలీసులకు, గ్రామ పంచాయతీ కార్యదర్శికి సమాచారం అందించారు. పోలీసులు రాగానే వారు ఫ్లెక్సీని తొలగించి, అక్కడే బీఆర్ అంబేద్కర్ విగ్రహం ముందు నీటి కుండీ నిర్మించాలని పట్టు బట్టి నిర్మాణాన్ని ప్రారంభించారు. పోలీసులు అదుపు చేసినా వినలేదు. పోలీసులు బలగాలను దింపి, నిర్మాణన్ని ఆపేసి అక్కడే పికెటింగ్ నిర్వహించారు. బడా భీంగల్‌లో బీఆర్ అంబేద్కర్ విగ్రహం ముందు ఫ్లెక్సీ ఏర్పాటు చేసిన వారిపై భీంగల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అంబేద్కర్‌ను అవమాన పరిచేలా చేస్తున్న వారిపై ఎస్సి ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని మాల మాదిగ కుటుంబాల సభ్యులు కోరారు. బిఆర్ అంబేద్కర్ విగ్రహం ముందు జరుగుతున్న వివాదం తెలుసుకుని దళిత సంఘం మండల నాయకులు గడాలా ప్రసాద్, మేకల శ్రీనివాస్, భీమా రవీందర్, బట్టు అనిల్, గట్టు రతన్ అక్కడికి చేరుకుని మద్దతుగా నిలిచారు. అంబేద్కర్ యువజన సంఘం బాల్కొండ నియోజకవర్గ ఇంచార్జ్ జిన్న జనార్దన్ బడా భీంగల్ దళితులకు మద్దతు తెలిపి.. రెచ్చగొడుతున్న వారిపై కేసు నమోదు చేయాలని భీంగల్ సీఐ పి.సత్యనారాయణ, ఎస్సై జి.మహేష్‌ను కోరారు.



భారీగా గుమిగూడిన ప్రజలు.. గ్రామంలో పోలీసుల పికెటింగ్



అంబేద్కర్ విగ్రహం ఎదుట ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ

విద్యార్థులను ఢీకొన్న ట్రాలీ ఆటో

- ఇద్దరికి తీవ్ర గాయాలు
- ఆస్పత్రికి తరలింపు

నవతెలంగాణ-గాంధారి
విద్యార్థులను ట్రాలీ ఆటో ఢీకొంది. దీంతో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన మండల కేంద్రంలోని తిప్పారం రోడ్డులో గల ఆశ్రమ పాఠశాల హాస్టల్ వద్ద గురువారం చోటుచేసుకుంది. ఎస్ఐ ఆంజనేయులు తెలిపిన వివరాల ప్రకారం.. పిట్లం గ్రామానికి చెందిన సాయి కళ్యాణ్ మూడవ తరగతి, అర్జున్ నాలుగో తరగతి అనే విద్యార్థులు ఆశ్రమ హాస్టల్ వద్ద బయట ఆడుకుంటున్నారు. ఈ క్రమంలోగాంధారికి చెందిన ట్రాలీ ఆటో (వాటర్ ఆటో) గాంధారి నుంచి తిప్పారం వైపు వెళ్తుండగా బలంగా ఢీకొంది. దీంతో వారిద్దరి తలకు, కాళ్లకు తీవ్ర గాయాలయ్యాయి. వారిని వెంటనే అంబులెన్స్‌లో కామారెడ్డి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



తీవ్ర గాయాలపాలైన బాలుడు

బాల్య వివాహాలు చేయొద్దు

- బాలికా శిశుసంరక్షణ జిల్లా అధికారిణి రసూల్ బీ
- కల్దుర్కిలో భేటీ బచావో భేటీ పడావో



అవగాహన పోస్టర్లను ఆవిష్కరిస్తున్న అధికారులు

నవతెలంగాణ-బోధన్
బాల్య వివాహాలు చేయడం చట్ట ప్రకారం నేరమని.. బాల్య వివాహాలు జరగకుండా ప్రతి ఒక్కరూ బాధ్యత తీసుకోవాలని జిల్లా బాలికా శిశు సంరక్షణ అధికారిణి రసూల్ బీ అన్నారు. గురువారం కల్దుర్కి హైస్కూల్‌లో నిర్వహించిన భేటీ బచావో భేటీ పడావో కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. భేటి బచావో భేటి పడావో కార్యక్రమంలో భాగంగా బాలిక సంరక్షణ వాటి ఐదు ఉద్దేశాలను వివరించారు. ఆడపిల్లల లింగ నిష్పత్తిని పెంచాలని, లింగ నిష్పత్తిని తగ్గుదలను అరికట్టాలని సూచించారు. సమాజంలో ఆడపిల్లలు, మగ పిల్లలు సమానమని అన్నారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ బోధన్ ప్రాజెక్టు సిడిపిఓ పద్మ, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఎంఈఓ నాగయ్య, షీటీం ఇన్చార్జ్ మహిళా ఏఎస్ఐ రేణుకాదేవి, సూపర్‌వైజర్ మణి, స్పెషలిస్ట్ ఇన్ ఫైనాన్స్ లిటరసీ పుష్ప, ఐసిపిఎస్ కౌన్సిలర్ జమ్రు పాల్గొన్నారు.

శ్రీ కాలభైరవ స్వామిని దర్శించుకున్న సినీ హీరో శ్రీకాంత్ దంపతులు

నవతెలంగాణ-రామారెడ్డి
మండలంలోని ఇసన్నపల్లి (రామారెడ్డి)లో వెలసిన శ్రీ కాలభైరవ స్వామిని సినీ హీరో శ్రీకాంత్-ఉమామహేశ్వరి దంపతులు గురువారం దర్శించుకున్నారు. బహులాష్టమి సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ అధికారులు వారికి శాలువాతో సన్మానించి, స్వామివారి జ్ఞాపిక, తీర్థ ప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో ఆలయ ఈవో ప్రభు రామచంద్రం, పూజార్లు శ్రీనివాస్ శర్మ, వంశీకృష్ణ శర్మ జూనియర్ అసిస్టెంట్ లక్ష్మణ్, సిబ్బంది నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



ఎల్ఐసీ నిర్వీర్యం సరికాదు

- ఎల్ఐసి కార్యాలయం వద్ద సమ్మెలో పాల్గొన్న ఉద్యోగులు

నవతెలంగాణ-ఆర్మూర్
భారతీయ జీవిత బీమా సంస్థ దేశ ప్రగతికి ఎంతో తోడ్పాటు అందిస్తుందని, అటువంటి ప్రభుత్వ రంగ సంస్థను నిర్వీర్యం చేసే చర్యలను ప్రభుత్వం వీడనాడాలని ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఎంప్లాయిస్ యూనియన్ డిమాండ్ చేసింది. భారతీయ జీవిత బీమా సంస్థ ఎల్ఐసిలో అతిపెద్ద ఉద్యోగ సంస్థ అయిన ఆల్ ఇండియా ఇన్సూరెన్స్ ఎంప్లాయిస్ అసోసియేషన్ ఇచ్చిన పిలుపు మేరకు గురువారం పట్టణంలోని ఎల్ఐసి బ్రాంచ్ ఆఫీసు ప్రాంగణంలో ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో మధ్యాహ్నం భోజన సమయానికి ముందు ఒక గంట సమ్మెలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముఖ్య వక్తగా హాజరైన సత్యనారాయణ మాట్లాడుతూ.. 3, 4వ తరగతి ఉద్యోగుల నియామకాలను వెంటనే చేపట్టాలని అన్నారు. అంతర్జాతీయ పారిశ్రామిక సంస్థ విధానాలకు అనుగుణంగా ఎల్ఐసిలో అతిపెద్ద ఉద్యోగ సంస్థ అయిన ఏఐఈఏకు గుర్తింపు నివ్వాలని డిమాండ్ చేశారు. 1996లో నోటిఫికేషన్ ద్వారా రిక్రూట్మెంట్ అయిన వారందరికీ పాత పెన్షన్ స్కీం వర్తింపజేయాలని ఎంవో-జీవో 57 అమలు చేయాలని తెలిపారు. ముఖ్యంగా భారతదేశ వ్యాప్తంగా నిరుద్యోగ సంస్థ విపరీతంగా పెరుగుతున్న సందర్భంలో ఎల్ఐసిలో 3, 4 తరగతి ఉద్యోగులు 1997లో 57,441 ఉండగా, ప్రస్తుతం ఆ సంఖ్య ప్రస్తుతం 42,632కు పడిపోయిందని, అంటే దాదాపు ఏడేళ్లలో 15 వేలకు పైగా ఉద్యోగుల సంఖ్య తగ్గిపోయిందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు డి.మారుతి, రాజేష్, శ్రావణ్, గోవర్ధన్, శివశంకర్, మురళి, రఘు ఏజెంట్లు తదితరులు పాల్గొన్నారు.



సమ్మెలో పాల్గొన్న ఎల్ఐసీ ఉద్యోగులు

రైతులకు నష్టం కలిగిస్తే సహించం

- జాతీయ పసుపు బోర్డు చైర్మన్ పల్లె గంగారెడ్డి
- వ్యవసాయ మార్కెట్ యార్డ్ సందర్శన

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ
రైతులకు నష్టం కలిగిస్తే సహించబోమని జాతీయ పసుపు బోర్డు చైర్మన్ పల్లె గంగారెడ్డి అన్నారు. నిజామాబాద్ నగరంలోని వ్యవసాయ మార్కెట్ యార్డును పసుపు బోర్డు చైర్మన్ పల్లె గంగారెడ్డి గురువారం ఆకస్మికంగా సందర్శించారు. గత రెండు మూడు రోజుల నుంచి మార్కెట్ యార్డులో జరుగుతున్న గందరగోళ పరిస్థితిని దృష్టిలో పెట్టుకొని మార్కెట్ యార్డును సందర్శించానని ఆయన తెలిపారు. ఈ చైర్మన్ ముప్పగంగారెడ్డితో కలిసి పసుపు యార్డు పరిశీలించి రైతులతో మాట్లాడారు. ఈ సందర్భంగా పల్లె గంగారెడ్డి మాట్లాడుతూ.. రైతులకు ఎటువంటి నష్టం కలిగించిన సహించేది లేదన్నారు. కమీషన్ ఏజెంట్లు, వ్యాపారస్తులు రైతులకు మేలు జరిగేలా చూడాలన్నారు. కాసేపు రైతులతో కలిసి ముచ్చటించారు. పసుపు కొనుగోలు కేంద్రాలను సందర్శించారు. పచ్చి పసుపును మార్కెట్ యార్డుకు తీసుకురావొద్దని రైతులను కోరారు. మార్కెట్ అధికారులు యార్డుకు వచ్చే పసుపు రైతులకు అన్ని సౌకర్యాలు కల్పించాలని అధికారులకు ఆదేశించారు. వ్యాపారస్తులు సిండికేట్ కాకుండా రైతులకు లాభపేక్షంగా నడుచుకోవాలని, పచ్చి పసుపును వ్యాపారస్తులు కోనుగోలు చేస్తే మార్కెట్ కమిటీ అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. పసుపు క్రయవిక్రయాల గురించి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ ముప్పా గంగారెడ్డి, మార్కెట్ కమిటీ సెక్రటరీ అపర్ణ, డైరెక్టర్ మల్లేష్, వ్యాపారస్తులు మాస్టర్ శంకర్, లాబిశెట్టి శ్రీనివాస్, సెల్లార్ కమిటీ అధ్యక్షులు దేవేందర్, తారక్, వేణుగోపాల్, తొగర నారాయణ, బిజెపి నాయకులు గంగోని గంగాధర్, గడ్డం రాజు తదితరులు పాల్గొన్నారు.



పసుపును పరిశీలిస్తున్న జాతీయ పసుపు బోర్డు చైర్మెన్ పల్లె గంగారెడ్డి

జ్యోతిబాపూలే పాఠశాలలో రాత్రి బస చేసిన కలెక్టర్

నవతెలంగాణ-బోధన్
బోధన్ పట్టణంలో కొనసాగుతున్న ఎడపల్లి మహాత్మా జ్యోతిబాపూలే వెనుకబడిన తరగతుల బాలుర సంక్షేమ పాఠశాలలో గురువారం రాత్రి కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు బస చేశారు. పాఠశాలను ఆకస్మికంగా సందర్శించిన కలెక్టర్, విద్యార్థుల స్టడీ అవర్స్ కొనసాగుతుండడాన్ని గమనించారు. విద్యార్థులకు అందిస్తున్న భోజన, వసతి సదుపాయాలు, విద్యా బోధన, రోజువారీ దినచర్య, మెనూ తదితర వివరాలను పాఠశాల ప్రిన్సిపాల్ జైపాల్‌ను అడిగి తెలుసుకున్నారు. స్టడీ అవర్స్ కొనసాగుతున్న గదులను సందర్శించి విద్యార్థులతో కలెక్టర్ భేటీ అయ్యారు. పదవ తరగతి, ఇంటర్ విద్యార్థులను పలు ప్రశ్నలు అడిగి వారి సామర్థ్యాన్ని పరిశీలించారు. ప్రభుత్వ పరంగా వారికి అందించిన పాఠ్య పుస్తకా లు, నోట్ బుక్కులు, ఇతర వసతులను పరిశీలించారు. అన్ని తరగతి గదులను, డార్మెటరీ, కిచెన్, డైనింగ్ హాల్ తదితర వాటిని సందర్శించి అందుబాటులో ఉన్న సదుపాయాల పరిశీలన జరిపారు. స్టోర్ రూమ్‌లో నిలువ ఉంచిన సరుకుల నాణ్యతను తనిఖీ చేశారు. విద్యార్థులతో కలిసి పాఠశాలలోనే కలెక్టర్ నిద్రించారు. కలెక్టర్ వెంట బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో, ఆర్.సీ.ఓ సత్యనాథ్‌రెడ్డి, తహసీల్దార్ విఠల్ తదితరులున్నారు.



విద్యార్థులతో కలిసి నిద్రిస్తున్న కలెక్టర్

రైతుల నిరసన యాత్రను జయప్రదం చేయండి

- తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి పల్లపు వెంకటేష్
- రైతులతో కలిసి కరపత్రాలు విడుదల



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న నాయకులు, రైతులు

నవతెలంగాణ-ఆర్మూర్
వ్యవసాయ మార్కెట్ విధానాల ముసాయిదా కేంద్ర ప్రభుత్వం వెనక్కి తీసుకోవాలని శుక్రవారం నిర్వహించే రైతుల నిరసన యాత్రను జయప్రదం చేయాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి పల్లపు వెంకటేష్ అన్నారు. పట్టణ పరిధిలో మామిడిపల్లిలో గురువారం రైతులతో కలిసి వ్యవసాయ మార్కెటింగ్ విధానాల ముసాయిదాలను కేంద్ర ప్రభుత్వం వెంటనే వెనక్కి తీసుకోవాలని కరపత్రాల విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం నవంబర్ 24న విడుదల చేసిన జాతీయ వ్యవసాయ మార్కెటింగ్ విధానంపై వివిధ రాష్ట్ర ప్రభుత్వాల అభిప్రాయాలను కోరిందని తెలిపారు. గతంలో రద్దయిన చట్టాలు మార్కెట్ రూపంలో రైతులపై రుద్దే అవకాశం ఉందని అన్నారు. ఈ ముసాయిదా విధానం రైతుల కోసం కాకుండా కార్పొరేట్ల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొని వ్యవసాయ మార్కెటింగ్ ముసాయిదా విధానాన్ని తీసుకొచ్చిందని అన్నారు. కేంద్ర ప్రభుత్వం వెంటనే ముసాయిదాను వెనక్కి తీసుకోవాలని, నేడు మార్కెట్ యార్డ్‌లో జీపు యాత్ర 10 గంటలకు ప్రారంభమవుతుందని అన్నారు. జీపుజాత ఆలూరు నుంచి నందిపేట్, నవీపేట్, జానకంపేట్ నుంచి గంజిలో ముగింపు ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు టి.భూమన్న, రైతులు పెద్ద రాయుడు, కారం చిన్న రాజన్న, పూత సాయన్న, దొనకంటి నడిపి గంగారం, నరేష్, ధ్యావల్ల రాజన్న తదితరులు పాల్గొన్నారు.

కరెంట్ షాక్‌తో ముగ్గురు మృతి

- బోధన్ మండలం పెగాడపల్లి శివారులో పొలంలో ఘటన
- మృతులు రెంజల్ మండలం సాటాపూర్ గ్రామస్తులు
- గ్రామంలో విషాధచాయలు



నవతెలంగాణ-బోధన్/రెంజల్
కరెంట్ షాక్‌తో ముగ్గురు మృతిచెందారు. ఈ విషాద ఘటన నిజామాబాద్ జిల్లా బోధన్ మండలంలోని పెగడాపల్లి గ్రామ శివారులోని ఓ రైతుకు చెందిన పంట పొలంలో చోటుచేసుకుంది. రెంజల్ మండలంలోని సాటాపూర్ గ్రామానికి చెందిన గంగారాం(45), బాలమణి(38), కుమారుడు కిషన్(22) ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు ప్రమాదవశాత్తు కరెంట్ షాక్‌తో మృతిచెందడంతో తీవ్ర విషాదం నెలకొంది.

వివరాలు మెయిన్‌లో..

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
2
నిజామాబాద్
శుక్రవారం | ఫిబ్రవరి 21, 2025 | www.navatelangana.com

21న సబ్ జూనియర్ బేస్ బాల్ ఎంపికలు

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

ఈనెల 21న సబ్ జూనియర్ బేస్ బాల్ నిజామాబాద్ జిల్లా జట్టు ఎంపిక పోటీలను నిర్వహించనున్నట్లు జిల్లా బేస్ బాల్ అసోసియేషన్ అధ్యక్షులు ఎల్ మధుసూదన్ రెడ్డి , ప్రధాన కార్యదర్శి సొప్పరి వినోద్ తెలిపారు. బాలుర ఎంపిక ఉదయం 8 గంటలకు సాంఘిక సంక్షేమ బాలుర పాఠశాల క్రీడా మైదానంలో బాలికల ఎంపిక సాంఘిక సంక్షేమ పాఠశాల సుద్దపల్లి క్రీడా మైదానంలో నిర్వహించనున్నారు.

ఎంపికలో పాల్గొనే క్రీడాకారులు జిల్లా కోచ్ లు నరేష్ మౌనిక జోష్ణ లకు రిపోర్ట్ చేయాలని అన్నారు. క్రీడాకారులు జనవరి 2010 తర్వాత జన్మించి ఉండాని, తెలంగాణ సాంఘిక సంక్షేమ పాఠశాల ఆర్మూర్ బాలుర విభాగం ఉదయం 9 గంటలకు ఎంపిక పోటీలు నిర్వహిస్తారని తెలియజేశారు. బాలికల విభాగం ఉదయం 9 గంటలకు ఎంపిక పోటీలు నిర్వహిస్తారని ప్రధాన కార్యదర్శి వినోద్ తెలిపారు.

జువెలరీ షాప్‌లో బంగారు నగల చోరీకి యత్నం

నవతెలంగాణ-కంఠేశ్వర్



నిజామాబాద్ నగరంలోని ఆజామ్ రోడ్‌లోగల బంగారం దుకాణంలో ఓ మహిళ చోరీకి యత్నించింది. ఈ సంఘటన బుధవారం రాత్రి జరిగింది. బాన్సువాడకు చెందిన మహిళ బుర్కా ధరించి బంగారం దుకాణంలో బంగారు చెవి కమ్మల కొనుగోలుకు వచ్చింది. ఈ సందర్భంగా పలు డిజైన్లు చూసి నచ్చలేదని వెళ్లేందుకు యత్నించింది. ఆమె చేతిలో సెల్ఫోన్ కింద జత కమ్మలను ఉంచుకొని మెల్లిగా జారుకునేందుకు యత్నించింది. గమనించిన షాపు యజమాని పట్టుకుని రెండవ టౌన్ పోలీసులకు అప్పగించారు. సంబంధిత మహిళ బంగారు చెవి కమ్మల చోరీయత్నం దృశ్యాలు సీసీటీవీ రికార్డుల్లో నిక్షిప్తమయ్యాయి. ఈ మేరకు రెండో టౌన్ పోలీసులు కేసు నమోదు చేసుకొని మహిళలను అదుపులోకి తీసుకొని విచారణ చేపట్టారు.

ఆర్థిక సహాయం చెక్కుల అందజేత



చెక్కు అందజేస్తున్న నాయకులు

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండల కేంద్రానికి చెందిన ముగ్గురు లబ్ధిదారులకు రాష్ట్ర మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి కృషితో ప్రభుత్వం మంజూరు చేసిన ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను గురువారం అందజేశారు. గ్రామానికి చెందిన ముగ్గురు లబ్ధిదారులకు రూ.31వేల 500 విలువైన ఆర్థిక సాయం చెక్కులను ప్రభుత్వం మంజూరు చేసింది. అట్టి చెక్కులను స్థానిక బిఆర్ఎస్ నాయకులు లబ్ధిదారుల ఇంటి వద్దకే వెళ్లి అందజేశారు. ఈ సందర్భంగా బిఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షులు కొంటి కంటి నరేందర్ మాట్లాడుతూ బాల్కొండ అభివృద్ధి ప్రదాత, రాష్ట్ర మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి చొరవతో బాధిత కుటుంబాలకు చెక్కులు పంపిణీ చేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో బిఆర్ఎస్ మండల ఉపాధ్యక్షులు మల్యాల సుభాష్ గౌడ్, మాజీ ఎంపీటీసీ సభ్యుడు మైలరం సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.

డయల్ యువర్ ఆర్‌టిసి

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ



తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ నిజామాబాదు రీజియన్ లో డయల్ యువర్ ఆర్టిసి కార్యక్రమం శుక్రవారం సాయంత్రం 04 నుండి 05 గంటల వరకు నిర్వహిస్తామని ఆర్టిసి రీజనల్ మేనేజర్ టి.జోస్నా గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల ప్రయాణికులు ఈ సదుపాయం సద్వినియోగము చేసుకోవాలని పేర్కొన్నారు. తమ సమస్యలను సూచనలకు నిజామాబాద్ రీజినల్ మేనేజర్ 9959226011, నిజామాబాద్ డివిజనల్ మేనేజర్ 9959226013, ఆర్మూర్ డిపో మేనేజర్ 9959226019, బోధన్ డిపో మేనేజర్ 9959226001, నిజామాబాద్ - 1 డిపో మేనేజర్ 9959226016 నెంబర్‌కు ఫోన్‌చేయాలని తెలిపారు. నిజామాబాద్ -2 డిపో మేనేజర్ 9959226017, కామారెడ్డి డిపో మేనేజర్ 9959226018, బాన్సువాడ డిపో మేనేజర్ 9959226020 ఫోన్ నెంబర్ లకు ఫోన్ చేసి తెలపాలని కోరారు.

15 సిమెంట్ బెంచీల వితరణ



బెంచీలు అందజేస్తున్న హైమద్

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

మండలంలోని చింతలూరు గ్రామానికి చెందిన హైమద్ వారి తండ్రి జ్ఞాపకార్థం గ్రామంలో 15 సిమెంట్ బెంచీలను అందించినట్లు కొలి ప్యాక్ సింగిల్ విండో చైర్మన్ నాగుల శ్రీనివాస్ తెలిపారు. ఈ సందర్భంగా నాగుల శ్రీనివాస్ మాట్లాడుతూ నా చిన్ననాటి స్నేహితుడు చింతలూరు వాస్తవ్యుడు హైమద్ అడగగానే 40వేల విలువ గల 15 సిమెంట్ బెంచీలు వాళ్ళ నాన్న సాదుల్ల మీరసాబ్ జ్ఞాపకార్థంగా చింతలూరు గ్రామానికి అందించడం జరిగిందని తెలిపారు. ఇందుకు గాను వారికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ నాగుల శ్రీనివాస్, జి.తిరుపతి రెడ్డి, ఎస్.రాజేశ్వర్, ప్రదీప్, లింబాద్రి, బాలకృష్ణ, వెంకట్ రెడ్డి, గంగాధర్, గంగారాం పాల్గొన్నారు.

టెలికాం అడ్వైజరి కమిటీ డైరెక్టర్‌గా ప్రసాద్ గౌడ్ నియామకం

నవతెలంగాణ-బాల్కొండ



మండల కేంద్రానికి చెందిన మిద్దెల ప్రసాద్ గౌడ్ ను జిల్లా టెలికాం అడ్వైజర్ కమిటీ డైరెక్టర్ గా నియమించారు. నిజామాబాద్ జిల్లా బిఎస్ఎన్ఎల్ టెలికాం డైరెక్టర్ గా తన నియామకానికి కృషి చేసిన రాజ్యసభ సభ్యుడు సురేష్ రెడ్డికి,మాజీ మంత్రి,ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డికి ఈ సందర్భంగా ప్రసాద్ గౌడ్ కృతజ్ఞతలు తెలిపారు.

న్యాయవాదుల సంబరాలు



మాట్లాడుతున్న న్యాయవాదులు

నవతెలంగాణ-కంఠేశ్వర్

దేశ రాజధాని ఢిల్లీలో భాజపా ప్రభుత్వం ప్రమాణ స్వీకారం చేసిన నేపథ్యంలో నిజామాబాద్ జిల్లా లీగల్ సెల్, న్యాయవాద పరిషత్ ఆధ్వర్యంలో గురువారం టపాకాయలు కాల్చి, మిఠాయిలు పంచి సంబరాలు జరుపుకున్నారు. జిల్లా కోర్టు చౌరస్తాలో జరిగిన కార్యక్రమంలో పరిషత్ జిల్లా అధ్యక్షుడు మల్లెపూల జగన్మోహన్ గౌడ్ మాట్లాడుతూ.. ఢిల్లీలో బీజేపీ ప్రభుత్వ ఏర్పాటుకు అండదండలు అందించిన ప్రజలకు జగన్ అభివాదాలు తెలియజేశారు. కార్యక్రమంలో న్యాయవాదులు ఎర్రం విగ్నేష్, మానిక్ రాజు, బిట్ల రవి, వసంత్ రావు, పిల్లి శ్రీకాంత్, విఘ్నేష్ సతీష్ నాగ్ అంజలి, జయప్రకాష్ లోయ, రాజు కిషన్ రావు, విక్రమ్ మొహమ్మద్ ఖాసిం, కిరణ్ శ్రీమాన్, తదితరులు పాల్గొన్నారు.

మాతృభాషకు పట్టం కడదాం

- జగమెరిగిన తెలుగు భాష
- మేలుకోకుంటే కనుమరుగే
- నేడు మాతృభాష దినోత్సవం సందర్భంగా

నవతెలంగాణ-ఆర్మూర్

శిశువుకు తల్లిపాలు ఎలాంటివో ఓ విద్యార్థికి మాతృభాష బోధన అలాంటిది అన్న రవీంద్రనాథ్ ఠాగూర్ మాతృభాష గొప్పతనాన్ని గుర్తించి తమ అరుదైన రచనలతో భాషకు పట్టాభిషేకం చేశారు. ఏ భాష నీది... ఏమి వేషము రా... ఈ భాష ఈ వేషం ఎవరికోసం రా... ఆంగ్లమందన్న మాటలు అనగానే ఇంత మక్కువ ఎందుకోసం రా... తెలుగు వాడవై తెలుగు రాదని సిగ్గు లేక ఇంకా చెప్పుట ఎందుకురా అన్నారు. కాళోజి నారాయణ రావు. మానసిక వికాసం కోసం మాతృభాష ఎంతో దోహదం చేస్తుందని, కానీ నేటి కాలంలో ప్రపంచీకరణ నేపథ్యం, సాంకేతిక ప్రభావంతో మనదైన స్వచ్ఛమైన భాష కనుమరుగై పోతుంది.. నేడు శుక్రవారం మాతృభాష దినోత్సవాన్ని పురస్కరించుకొని నవతెలంగాణ అందిస్తున్న ప్రత్యేక కథనం...



గతమెంతో ఘనం అని చెప్పుకోడానికేనా...

ప్రపంచంలో ఆరువేల భాషలు ఉన్న ఇప్పటికే మూడువేల భాషలు కనుమరుగయ్యాయి. మరో 100 భాషలు తుది శ్వాసకు చేరుకున్నట్టు యునెస్కో నివేదిక ఇచ్చింది. ఈ విషయం అందరిలో ఆలోచన కలిగించాల్సి ఉన్న స్పందన అంతంత మాత్రంగానే ఉంది. ఇప్పటికైనా మేల్కొనకపోతే అమృత తుల్యమైన భాషగా పేరుపొందిన మన తెలుగు భాష తెలంగాణ యాస కనుమరుగయ్యి కాలం ఎంతో దూరంలో లేదని అభిమానులు అంటున్నారు. గత మెంతో ఘనం అని చెప్పుకోవడానికి తప్ప నేడు అమ్మ భాష అంతంత మాత్రంగానే ఉంది. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత అమలు మాత్రం పూర్తిస్థాయిలో కనిపించడం లేదు. ఉన్నత అధికారులు 100శాతం అమలు చేయాలని చెబుతున్న క్షేత్రస్థాయిలో అది కనిపించటం లేదు. అధికారులు ఆదేశించినప్పుడు మాత్రమే విధి నిర్వహిస్తూ మనకెందుకులే అని చేతులు దులిపేస్తున్నారు.

కొన్ని ఉదాహరణలు...

నేడు విద్యాసంస్థలలో మాతృ భాష కంటే ఇంగ్లీష్ చదువులపైనే ఆసక్తి చూపుతున్నారు. గ్రామం నుంచి రాష్ట్రస్థాయి వరకు మాతృభాష అమలు చేయాల్సిన అవసరం ఉన్న ఆయా శాఖల మధ్య సమన్వయ లోపంతో పూర్తి కాకుండా పోతుంది. సహ సంరక్షణ వేదిక అధ్యక్షులు అంకం నరేష్ జిల్లాలోని పంపిణీ చేసిన పశు గ్రాసం విత్తనాలు, జంతువు వధల మార్గదర్శకాల వివరాల గురించి గతంలో పశు సంవర్ధక శాఖకు దరఖాస్తు చేస్తే కార్యాలయ సాంకేతిక పదాలతో ఆంగ్లంలో అర్థం కాకుండా ఇవ్వడం..... జక్రాన్‌పల్లి మండలంలోని పడకల్ గ్రామంలో సహ ఉద్యమకారునిగా పనిచేసిన జలంధర్ జిల్లా ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రిలోని ఎయిడ్స్ రోగుల వివరాలు, ఏఆర్‌పి కేంద్రాల వివరాల కోసం దరఖాస్తు చేస్తే ఆంగ్లంపై అవగాహన లేని దరఖాస్తుదారునికి ఆ సమాచారం ఎలా అర్థం అవుతుంది. ఆలూరు మండలంలోని దేగాం గ్రామానికి చెందిన సాయినాథ్ గతంలో జిల్లాలోని రేషన్ డీలర్ల అక్రమాలు, పట్టుకున్న రేషన్ సరుకుల వివరాల గురించి జిల్లా పౌర సరఫరాల కార్యాలయానికి దరఖాస్తు చేస్తే సమాచారం మొత్తం ఆంగ్లంలోని ఇచ్చి అన్ని సాంకేతిక పదాలు ఆ శాఖ అధికారులకే అర్థం కాకుండా ఇవ్వడం జరిగింది.

అప్పటి కలెక్టర్ టీవీ రాయుడు స్ఫూర్తితో ...

మాతృభాష అమలుకు గతంలో జిల్లా కలెక్టర్గా పనిచేసిన టీవీ రాయుడు ఎందరికో స్ఫూర్తిదాయకంగా నిలిచారు. తన వద్దకు వచ్చే దస్త్రాలు తప్పకుండా స్థానిక మాతృభాషలో ఉండాలని ఆదేశాలు జారీ చేశారు. అమలుకై తెలుగులో రాయన్నందుకు తిప్పి పంపడమైనది అని ముద్ర వేసేవారు. ప్రభుత్వ ప్రైవేటు కార్యాలయాల భవనాలకు తెలుగులో పేర్లు రాయాలని అన్ని కార్యకలాపాలను పూర్తిగా తెలుగులోనే నిర్వహించాలని ఆదేశాలు జారీ చేశారు వాటిని అమలుపరిచిన అధికారిగా రాష్ట్రంలోనే గుర్తింపు పొందారు. వీరి తర్వాత అప్పటి సీనియర్ న్యాయమూర్తి రచయిత బంగారి రాజేందర్ తెలుగులోనే తొమ్మిది తీర్పులు ఇచ్చి మాతృభాషపై తన అభిమానాన్ని చాటుకున్నారు.

420 ఉత్తర్వులు మరిచారు...

రాష్ట్ర ప్రభుత్వ శాఖల్లో సమాచారం అంతా ఉత్తరు సంఖ్య 420 అమలు పరిచారు. నేడు జిల్లాల్లో కొన్ని శాఖల్లో తప్ప అన్ని శాఖల్లోనూ ఆంగ్లంలోనే సమాచారం ఇస్తున్నారు.

జగమెరిగిన తెలుగు భాష

ప్రధానోపాధ్యాయురాలు కవిత

మండలంలోని కోమన్‌పల్లి పాఠశాలలో 7వ తరగతిలోనే నాటికలు రాస్తున్న విద్యార్థులు నిహారిక, శ్రీనిధి, లక్ష్మీ ప్రియ, నవ్య, అక్షర, ఎస్.శ్రీనిధి, తెలుగు భాషాభివృద్ధికి కృషి చేస్తున్నట్టు ప్రధానోపాధ్యాయురాలు కవిత తెలిపారు.

మాతృభాషకు పట్టం కట్టేందుకు 'కోకిల' నిర్విరామ కృషి...

మండలంలోని అంకాపూర్ గ్రామానికి చెందిన తెలుగు ఉపాధ్యాయులు కోకిల నాగరాజు ఏ పాఠశాలలో పనిచేసిన విద్యార్థులలో ఉన్న నైపుణ్యాన్ని వెలికి తీసి తెలుగు భాషాభివృద్ధికి నిర్విరామ కృషి చేస్తున్నారు. గతంలో మండలంలోని మంతిని పాఠశాలలతో పనిచేస్తున్నప్పుడు విద్యార్థుల ప్రతిభను గుర్తించి ప్రోత్సహించారు. రైతు గోస, మట్టిబంధం, ప్లాస్టిక్ భూతం, ఈ ఫోను మాకొద్దు, భూమిని బతికిద్దాం, యుగాది సీరియల్ గోల, కత్తుల బావి, ఓ అర్చన కథ విద్యార్థులు రాసిన నాటకాలు అంటే ఆశ్చర్యపోక తప్పదు. ప్రతి నాటికలు చక్కని సందేశాన్ని ఇస్తూ నవ్విస్తూ చిన్న వయసులో ముచ్చట్లు అనే నాటికల సంకలనాన్ని రూపొందించి రాష్ట్రస్థాయిలో అనేక ప్రశంసలు అందుకున్నారు మంతిని ఉన్నత పాఠశాల విద్యార్థులు. రంగనాయక శతకం పుస్తక రచన ద్వారా హై స్కూల్ స్థాయిలోనే చందోబద్ధంగా పద్యాలు రాయడం ఈ విద్యార్థుల కృషికి నిదర్శనం.

చిట్టి పొట్టి కవితలతో అబ్బురపరిచే చిన్ని దివ్వెలు....

తనకొచ్చిన కలలు తన పిల్లలందరికీ పంచాలి అన్న తపనతో విద్యార్థులకు నృత్యం, గానం, ఏకపాత్ర బుర్రకథ, నాటక రచన, పద్య రచన, కవితా రచన ఇలా అనేక అంశాలలో శిక్షణ ఇస్తూ విద్యార్థులను ఉన్నతులుగా తీర్చిదిద్దుతున్న కోకిల నాగరాజు ప్రస్తుతం మండలంలోని కోమన్ పల్లి పాఠశాలలో ఉపాధ్యాయునిగా పనిచేస్తున్నారు. దేశభక్తి గేయాలు జానపద గేయాలు, అభినయ గేయాలు ఈ పాఠశాల పిల్లలకు వెన్నతో పెట్టిన విద్య. అంతర్జాతీయ వేదికల పైన ఎన్నో సాంస్కృతిక కార్యక్రమాలకు ప్రాణం పోసిన తెలుగు ఉపాధ్యాయులు నాగరాజు వీరికి గురువుగా ఉండడమే వీళ్ళందరి ఘనతకు ముఖ్య కారణం. వ్యాసరచనలో జాతీయస్థాయిలో నాట్యాలు, రాష్ట్రస్థాయిలో గానంలో రాష్ట్ర, జిల్లా స్థాయిలో ప్రతిభ కనపరిచిన విద్యార్థులు అనేక సాహితీ సంస్థల ప్రశంసలు అందుకున్నారు. విద్యార్థుల ఉన్నతి కోసం అహర్నిశల శ్రమిస్తూ మాతృభాష సేవలో తరిస్తున్న నాగరాజు 2023 ఉత్తమ ఉపాధ్యాయునిగా అవార్డు అందుకోవడంతో పాటు అనేక అంతర్జాతీయ జాతీయ రాష్ట్రస్థాయి అవార్డులు సాధించారు. ఎడపల్లి నాగరాజుకు(కోకిల) కళా రంగంలో గౌరవ డాక్టరేట్ లభించింది. గాయకుడిగా, నృత్య దర్శకుడిగా, వ్యాఖ్యాతగా, రచయితగా, మిమిక్రీ, వెంట్రిలాక్విజం కళాకారుడిగా బహుముఖ ప్రజ్ఞాశాలిగా అనేక సంవత్సరాలుగా పల్లెల నుండి అంతర్జాతీయ వేదికల వరకు తన ఆట,పాట మాటలతో అలరించిన నాగరాజుకు కళా రంగంలో ఈ అవార్డు లభించింది. ఫేమ్ అచీవర్స్, సెలబ్రేషన్స్ సెంచరీస్ ఆధ్వర్యంలో జనవరి 31న ఆగ్రాలో జరిగే కార్యక్రమంలో జార్జియా డిజిటల్ యూనివర్సిటీ వారు నాగరాజుకు గౌరవ డాక్టరేట్ ప్రధానం చేశారు. ఆర్ట్ అండ్ కల్చర్ విభాగంలో తెలంగాణ నుండి ముగ్గురికి ఈ అవార్డు లభించగా అందులో అంకాపూర్ గ్రామానికి చెందిన నాగరాజు ఒకరు. బహుముఖ ప్రజ్ఞాశాలిగా అనేక మంది ప్రముఖుల సభలకు వ్యాఖ్యాతగా, గాయకుడిగా నృత్యదర్శకుడుగా నాగరాజు ఎన్నో ఏళ్లుగా కళా పోషణ చేస్తున్నారు. అనేకమంది శిష్యులకు ఈ రంగంలో ఉచితంగా శిక్షణ ఇచ్చి ప్రోత్సహించారు. ఆర్మూర్ ప్రాంతానికి చెందిన కళాకారుడికి గౌరవ డాక్టరేట్ లభించడం పట్ల ఈ ప్రాంతవాసులు హర్షం వ్యక్తం చేశారు.

పద్య పఠనంలో దిట్టలు... కోమన్‌పల్లి విద్యార్థులు

ఒకటి కాదు రెండు కాదు ఏకంగా ఐదు శతకాల పద్యాలు ఒకేసారి పఠనం చేసి ఆ పిల్లలు అబ్బుర పరిచారు. చందోబద్ధంగా పద్యాలు రాయగలరు. కవితలు, నాటికలు , పాటలు , కథలు రాయగలరు. మాతృభాష పై మమకారంతో తెలుగు భాష పై పట్టు సాధించిన ఆ విద్యార్థులు కోమన్ పల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు. 7వ, 8వ తరగతి విద్యార్థులు సృజనాత్మక రచనలో భాగంగా ప్రతిరోజు ఒక కథ గాని కవిత గాని నాటిక గాని రాయడం ఇక్కడి పిల్లలకు నిత్య కృత్యం. తెలుగు భాష వికాసానికి విశేషంగా కృషి చేస్తున్న కోమన్ పల్లి విద్యార్థులు రాష్ట్ర ,జిల్లా స్థాయిలో వివిధ సాహితీ అంశాల్లో గుర్తింపు పొంది బహుమతులు సాధించారు. ఈ విద్యార్థులు రాసిన తెలుగు నాటికల సంకలనం అచ్చు కావడానికి సిద్ధంగా ఉంది.

జగమెరిగిన భాష మనది

మాడవేడి పద్మావతి , ఉపాధ్యాయురాలు, ఆర్మూర్.



అమ్మతనం మాతృ ప్రేమ ఎంత స్వచ్ఛగా ఉంటాయో అలాంటిదే మాతృభాష. జగమెరిగిన భాష మనది. ఆంగ్ల భాష అవసరమైన తల్లి భాష ఎప్పటికీ మరిచిపోవద్దు. మంచి ఫలితాలు సాధించాలంటే తల్లి భాషలోనే సాధ్యం ఈ విషయాన్ని అందరూ తెలుసుకొని అమలు కోసం కృషి చేయాలి.

బోధనకే పరిమితం కాకూడదు..

కోకిల నాగరాజు, తెలుగు భాష ఉపాధ్యాయులు-కోమన్‌పల్లి




ఉపాధ్యాయుడు కేవలం బోధనకి పరిమితమైతే విద్యార్థులు అద్భుతాలు సాధించలేరు. సృజనాత్మక రచన ద్వారా విద్యార్థులు వివిధ సాహితీ అంశాల్లో రాణిస్తున్నారు. కథ, నాటిక, వ్యాసం, లేఖ, ఆత్మ కథ మొదలగు అంశాలు చక్కగా రాయగలుగుతున్నారు. గతంలో చిన్ని దివ్వెలు, రంగ నాయక శతకం, ముచ్చట్లు పుస్తకాలు విద్యార్థుల రచనలతో వెలువరించారు. ప్రస్తుతం విద్యార్థులు రాసిన నాటికలు పుస్తకంగా తేవడానికి సిద్ధం చేస్తున్నాం. మాతృ భాష లో పట్టు సాధించిన వారు మిగితా అన్ని విషయాల్లో రాణిస్తారు.

ఫారెస్ట్ అధికారుల దౌర్జన్యాన్ని అరికట్టాలి

- సాగుదారులకు న్యాయం చేయాలి
- సిపిఐ(ఎంఎల్) మాస్ లైన్
- రూరల్ ఎంఎల్ఏ క్యాంప్ ఆఫీస్‌కు తరలిన పట్టాదారులు

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

సిరికొండ 532లో భూమి లబ్ధిదారులపై పారెస్టు అధికారుల దౌర్జన్యాన్నీ అరికట్టాలని, సాగుదారులపై అటవీశాఖ అధికారుల జులుంను అదుపుచేసి లబ్దిదారులకు న్యాయం చేయాలని సిపిఐ(ఎం.ఎల్) మాస్ లైన్ పార్టీ ఆధ్వర్యంలో గురువారం సిరికొండ 532 సర్వే నెంబర్ పట్టాదారులు రూరల్ ఎంఎల్ఎ భూపతి రెడ్డి క్యాంప్ ఆఫీస్‌కు తరలి వెళ్లారు. ఈ సందర్భంగా సిపిఐ(ఎంఎల్) మాస్ లైన్ రాష్ట్ర సెక్రటేరియట్ సభ్యులు వి. ప్రభాకర్, రాష్ట్ర నాయకులు పి. రామకృష్ణ మాట్లాడుతూ.. సిరికొండ మండల కేంద్రానికి చెందిన 532 సర్వే నెంబర్‌కు చెందిన లబ్ధిదారుల భూములను అటవీ శాఖ అధికారులపై



మాట్లాడుతున్న రూరల్ ఎమ్మెల్యే

భూముల జోలికి పోకూడదని అటవీ శాఖ అధికారులను ఆదేశిస్తూ హైకోర్టు తీర్పునిచ్చిందని తెలిపారు. అయినా అటవీశాఖ అధికారులు హైకోర్టు తీర్పును బేఖాతారు చేస్తున్నారన్నారు. 20 ఏళ్లుగా అధికారులను మొదలుకొని జిల్లా కలెక్టర్ వరకు విన్నవించుకున్నట్టు తెలిపారు. ఫారెస్టు అధికారుల జులుంను అరికట్టి పట్టాలు పొందిన లబ్ధిదారులకు భూములు చెందేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. సిరికొండ మండల కేంద్రంలోని 532 సర్వే నెంబర్ లో 200 మంది లబ్ధిదారులకు 2009లో ఆనాటి కాంగ్రెస్ ప్రభుత్వం పట్టాలు చేసి లబ్ధిదారులకు ఇచ్చిందని తెలిపారు. పట్టాలు ఇచ్చాక తమ భూములను చదును చేసుకుందామని లబ్ధిదారులు ప్రయత్నిస్తుంటే అటవీశాఖ అధికారులు అడ్డుకుంటున్నారన్నారు. ఈ సమస్యను అర్థం చేసుకొని సిరికొండ 532 లబ్ధిదారులకు న్యాయం చేయాలని తమరికి విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో సిపిఐ ఎంఎల్ మాస్‌లైన్ రాష్ట్ర నాయకులు, పిట్ల. రామకృష్ణ, ఆర్మూర్ డివిజన్ సహాయ కార్యదర్శిఆర్. రమేష్ డివిజన్ నాయకులు ఆర్. దామోదర్, బి. బాబన్న, మండల నాయకులు ఈ. రమేష్,ఎం. డి. అనిస్, ఎస్. కిషోర్, బి. నాగన్న, జాహిరబీ, ఐనాలా. ముత్త, సీతాయ్ పేట. గంగవ్వ, మందుల. గంగాధర్, స్వరూప, లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

వ్యసనాలకు దూరంగా ఉండాలి

- విద్యార్థులకు సూచించిన కళాశాల ప్రిన్సిపాల్ రజియుద్దీన్ అస్లాం

నవతెలంగాణ-బాల్కొండ

వ్యసనాలకు దూరంగా ఉండాలని కళాశాల ప్రిన్సిపల్ రజియుద్దీన్ అస్లాం విద్యార్థులకు సూచించారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గురువారం సీనియర్ విద్యార్థులకు ఫేర్ వెల్ పార్టీ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో మెలగాలని వ్యసనాలకు దూరంగా ఉండాలని సూచించారు. క్రమశిక్షణతో మెలిగి భవిష్యత్తులో ఉన్నత స్థానాలకు ఎదగాలని కళాశాలకు మంచి పేరు తీసుకురావాలని ఆశించారు. అనంతరం క్రీడల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు ప్రధానం చేశారు. కార్యక్రమంలో ఎంఈఓ బట్టు రాజేశ్వర్, మోడల్ స్కూల్ ప్రిన్సిపల్ శ్రీనివాస్ ప్రసాద్, డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ వేణు ప్రసాద్, కళాశాల బోధన సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

పరీక్ష ప్యాడ్స్, పెన్నులు వితరణ



విద్యార్థులకు ప్యాడ్స్, పెన్నులు అందజేత

నవతెలంగాణ-ఆర్మూర్

ఆలూరు మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల 10వ తరగతి 72 మంది విద్యార్థినులకు ఈఆర్ ఫౌండేషన్ చైర్మన్, చార్టెడ్ అకౌంటెంట్ ఈరవత్రి రాజశేఖర్ గురువారం పరీక్ష ప్యాడ్స్, పెన్నులు అందించారు. ఫౌండేషన్ చైర్మన్ ఈరవత్రి రాజశేఖర్‌ను హై స్కూల్ ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు ఆశ్ఫక్, సి రెడ్డి, సైఫ్‌లను ఫౌండేషన్ చైర్మన్, సభ్యులు సన్మానించారు ,ఈ కార్యక్రమంలో మండల ఇన్చార్జి, ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మిస నరేందర్, అశ్ఫక్, ఫౌండేషన్ సభ్యులు ఆర్గుల్ సురేష్, రాంప్రసాద్, కొండి రామచందర్, గోపి కృష్ణ, సైఫ్, ముజాహిద్, విక్రాంత్ సుబ్బు ,ఆలూరు కింగ్స్ యూత్ క్లబ్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

మత్స్యకారుడు మృతి

- తెప్ప బోర్ల పడి వలలో చిక్కుకోవడంతో ఘటన

నవతెలంగాణ-బాల్కొండ



చేపల వేటకు వెళ్లి ప్రమాదవశాత్తు తెప్ప బోర్ల పడడంతో వలలో చిక్కుకుపోయి మత్స్యకారుడు మృతి చెందిన ఘటన బాల్కొండ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ముప్కాల్ మండలంలోని వేంపల్లి గ్రామానికి చెందిన బట్టు నడిపి రాజన్న (60) రోజువారీగా బుధవారం సాయంత్రం బస్సాపూర్ శివారులో శ్రీరామ్ సాగర్ ప్రాజెక్ట్ బ్యాక్ వాటర్ లోకి చేపలు పట్టడానికి వెళ్ళాడు. ఈ క్రమంలో ప్రమాదవశాత్తు నీటిలో తెప్ప బోర్ల పడి చేపల కోసం వేసే వల చేతికి శరీర భాగానికి చిక్కుకుపోవడంతో నీటిలో మునిగి ఊపిరి ఆడక అక్కడికక్కడే మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు గురువారం బాల్కొండ పోలీస్ స్టేషన్ ఎస్ఐ బి.నరేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

మహిళ మృతదేహం లభ్యం

నవతెలంగాణ-ఆర్మూర్



పట్టణంలో అల్జాపూర్ రాజేష్ కొత్తగా కడుతున్న బిల్డింగ్ సంప్‌లో గుర్తు తెలియని మహిళ మృతదేహం లభ్యమైనట్టు స్టేషన్ హౌస్ ఆఫీసర్ సత్యానారాయణ గురువారం తెలిపారు. 40, 45 మధ్య వయసు కలిగివున్న మహిళ ఫిట్స్ వల్ల సంపులో పడి చనిపోయినట్టు పేర్కొన్నారు. మొదట వాచ్‌మెన్ చూసినట్టు తెలిపారు. మహిళ గురించి తెలిసినవారు నంబర్ 8712695858 ఫోన్ చేయాలని పేర్కొన్నారు.

బస్సు ట్రిప్పులు పెంచాలి

● అదనపు కలెక్టర్‌కు విద్యార్థుల వినతి



వినతిపత్రాన్ని అందజేస్తున్న విద్యార్థులు

నవతెలంగాణ-గాంధారి

మండలంలోని రామలక్ష్మణ్‌పల్లి గ్రామానికి బస్సు ట్రిప్పుల సంఖ్య పెంచాలని గ్రామానికి చెందిన విద్యార్థులు కామారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్‌ను కోరారు. ఈ మేరకు గురువారం వినతిపత్రాన్ని అందజేశారు. అదే విధంగా నల్లమడుగు ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు ఎక్కువగా విద్యార్థులకు పాఠాలు బోధించకుండా సెల్‌ఫోన్లు మాట్లాడుతున్నారని పేర్కొన్నారు. పదవ తరగతి చదువుతున్న విద్యార్థులకు స్టడీ అవర్స్ సరిగా నిర్వహిస్తలేరని కలెక్టర్‌కు వివరించారు. అందుకు స్పందించిన అదనపు కలెక్టర్ సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తానని విద్యార్థులకు హామీనిచ్చారు.

మొక్కలు ఎండిపోకుండా జాగ్రత్తలు తీసుకోవాలి

● ఎంపీడీవో సయ్యద్ సాజిద్ అలీ



నవతెలంగాణ-తాడ్వాయి

నర్సరీలో మొక్కలు ఎండిపోకుండా జాగ్రత్త తీసుకోవాలని ఎంపీడీవో సయ్యద్ సాజిద్ అలీ అన్నారు. గురువారం మండలంలోని బ్రహ్మాజీవాడి గ్రామంలోని నర్సరీని ఆయన పరిశీలించారు. ప్రస్తుతం వేసవిలో అవసరమైన నీటి తడులను అందిస్తూ నిత్యం క్షేత్రస్థాయిలో పరిశీలన చేయాలని పంచాయతీ కార్యదర్శిని ఆదేశించారు. పల్లె ప్రకృతి వనాల్లో ఏపుగా పెరిగిన చెట్లను ఎండిపోకుండా కాపాడుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ హనుమాన్లు, కార్యదర్శి పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వైద్య సిబ్బంది సమయపాలన పాటించాలి

● తహసీల్దార్ శ్రావణ్‌కుమార్



రికార్డులను పరిశీలిస్తున్న తహసీల్దార్

నవతెలంగాణ-రెంజల్

వైద్య సిబ్బంది సమయపాలన పాటిస్తూ రోగులకు సేవలను అందించాలని తహసీల్దార్ శ్రావణ్‌కుమార్ సూచించారు. మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తహసిల్దార్ శ్రావణ్ కుమార్ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. రోగులకు ఎలాంటి చికిత్సలు జరుగుతున్నాయో అడిగి తెలుసుకున్నారు. కుక్క కాటు, పాము కాటు, సంబంధించిన మందుల గురించి ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో ఆయుష్ డాక్టర్లు ప్రమోదిత, ఉజ్మ, ఆరోగ్య విస్తీర్ణ అధికారి కరిపే రవీందర్, ఆర్ఐ రవికుమార్, ఫార్మసిస్ట్ మోయిస్, ఆరోగ్య కార్యకర్తలు, ఆశాలు పాల్గొన్నారు.

మీ సేవ కేంద్రాల తనిఖీ..

మండల కేంద్రంలోని మీసేవ కేంద్రాలను తహసిల్దార్ శ్రావణ్ కుమార్ ఆకస్మికంగా తనిఖీలు చేపట్టారు. మీ సేవకు వచ్చే వారికి తమ సేవలను అందించాలని, వారి వద్ద అదనపు వసూళ్లను చేయరాదని ఆయన వారికి హెచ్చరించారు. ఆధార్ కార్డులో మార్పులు చేర్పుల కోసం వచ్చే వారికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా వారికి సేవలను అందించాలని ఆయన సూచించారు. ఆయన వెంట ఆర్ఐ రవికుమార్, మీసేవ నిర్వాహకులు భూమేష్ తదితరులు ఉన్నారు.

కాంగ్రెస్ ఎమ్మెల్సీ అభ్యర్థిని గెలిపించాలి

● రాష్ట్ర సలహాదారుడు పోచారం శ్రీనివాస్‌రెడ్డి



మాట్లాడుతున్న సలహాదారులు పోచారం శ్రీనివాస్‌రెడ్డి

నవతెలంగాణ-నసురుల్లాబాద్

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ ఆదేశాల మేరకు కాంగ్రెస్ బలపరిచిన పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి నరేందర్‌రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించేలా ప్రతి కాంగ్రెస్ కార్యకర్త కృషి చేయాలని పార్టీ కార్యకర్తలకు, నాయకులకు రాష్ట్ర వ్యవసాయ సలహాదారులు, బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి సూచించారు. గురువారం బాన్సువాడ నియోజకవర్గంలోని నసురుల్లాబాద్ మండలంలోని మైలారం గ్రామంలో ఓ కార్యకర్త పెండ్లికి హాజరై నవవధువరులను ఆశీర్వదించారు. అనంతరం నాయకులు, కార్యకర్తలతో ఆయన మాట్లాడుతూ.. బాన్సువాడ నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధి సంక్షేమ పథకాలను వివరిస్తూ ఓటు శాతం పెరిగేలా కృషిచేయాలన్నారు. ఓటరు జాబితా ఆధారంగా ఓటర్లను నేరుగా కలిసి కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలు అభివృద్ధిపై వివరిస్తూ అభ్యర్థి గెలుపు కోసం కృషి చేయాలని కోరారు. ఓటరు జాబితా ప్రతి గ్రామం వారీగా విడివిడిగా తీసుకుని గ్రామ, మండలంలో ఒక కమిటీ ఏర్పాటు చేసుకుని ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఆగ్రో సంస్థ చైర్మన్ కాసుల బాలరాజ్, మాజీ డిస్టిక్ కోపరేటివ్ చైర్మన్ పోచారం భాస్కర్‌రెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ పెరిక శ్రీనివాస్, నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

అంగన్వాడీ కేంద్రం సందర్శన



అంగన్‌వాడీ చిన్నారులతో ఎంపీడీవో వెంకటేష్

నవతెలంగాణ-రెంజల్

మండల కేంద్రంలోని అంగన్వాడీ కేంద్రాన్ని ఎంపీడీవో వెంకటేష్ యాదవ్ గురువారం తనిఖీ చేశారు. ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహారాన్ని చిన్నారులకు అందేలా చూడాలని ఆయన తెలిపారు. చిన్నారులకు భోజనంతోపాటు ప్రతిరోజు గుడ్డును అందించాలని ఆయన సూచించారు. గర్భిణులు, బాలింతల విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఆయన పేర్కొన్నారు. గర్భిణులు తమ పిల్లల ఆరోగ్యం కోసం ఎక్కువగా ఆకుకూరలు, కాయగూరలు వాడాలని అన్నారు. తమ పెరట్లో ఆకుకూరలు, కాయగూరలు పండించుకునేలా వారికి అవగాహన కల్పించాలన్నారు. రసాయన ఎరువులకు బదులు సేంద్రీయ ఎరువులతో కూరగాయలు పండించుకుంటే పోషకాలు ఎక్కువగా ఉంటాయని ఆయన పేర్కొన్నారు. ఆయన వెంట గ్రామ కార్యదర్శి రాజేందర్‌రావు, అంగన్వాడీ సిబ్బంది, ఆయాలు, గర్భిణీలు పాల్గొన్నారు.

తాగునీటి ఇబ్బందులు రావొద్దు

● స్పెషల్ ఆఫీసర్ సయ్యద్ సాజిద్ అలీ



మరమ్మతులు నిర్వహిస్తున్న కార్మికులు

నవతెలంగాణ-తాడ్వాయి

తాగునీటి ఇబ్బందులు రాకుండా చూడాలని స్పెషల్ ఆఫీసర్ సయ్యద్ సాజిద్ అలీ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని తాడ్వాయిలో బోరు మోటర్ చెడిపోవడంతో మరమ్మతులు చేపట్టారు. మండల కేంద్రంలో ప్రస్తుత వేసవిలో నీటి ఇబ్బందులు కలగవద్దన్న ఉద్దేశంతో ఒకే రోజులో మరమ్మత్తు పనులు చేయించామని తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి బాలు, సిబ్బంది స్వామి, గంగారాం, బాలరాజ్,రాజయ్య పాల్గొన్నారు.

భవిష్యత్తును బంగారు బాటగా మార్చుకోవాలి

● ప్రిన్సిపాల్ ఫిరోజ్ హైదర్



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ ఫిరోజ్ హైదర్

నవతెలంగాణ-రెంజల్

విద్యార్థులు విద్యతో పాటు క్రమశిక్షణను అలవర్చుకున్నప్పుడే విద్యార్థులు తమ భవిష్యత్తును బంగారు బాటగా మార్చుకునే అవకాశం కలుగుతుందని ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ ఫెరోజ్ హైదర్ పేర్కొన్నారు. గురువారం మండల కేంద్రంలోని తెలంగాణ ఆదర్శ పాఠశాలలో ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు ఏర్పాటు చేసిన వీడ్కోలు సమావేశంలో ఆయన మాట్లాడారు. ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు ప్రథమ సంవత్సరం విద్యార్థులకు ఘనంగా వీడ్కోలు సమావేశాన్ని నిర్వహించారని, వారి ఆశలను అడియాసలు కాకుండా ఉత్తమ ర్యాంకులను సాధించాలని ఆయన సూచించారు. విద్యార్థులు ఉత్తమ ఫలితాలను సాధించి తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు, గౌరవం తీసుకురావాలని ఆయన అన్నారు. ప్రస్తుత సమయంలో ప్రతిక్షణం అతి విలువైనదని, ఏకాగ్రతతో చదివి ఉత్తమ ఫలితాలు సాధించాలని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పిఆర్టియు మండలాధ్యక్ష కార్యదర్శులు టి.సోమలింగం గౌడ్, కిషోర్ కుమార్, సాయిరెడ్డి, ప్రిన్సిపాల్ ఫిరోజ్ హైదర్, ఉపాధ్యాయులు పురుషోత్తం, సిహెచ్.గంగాధర్, ప్రవీణ్, శంకర్, సలావుద్దీన్, ప్రతాప్, రాజేందర్, రాధా, స్వప్న, జబేరియా, ఇంతియాజ్, భానుచందర్, సౌమ్య, కల్పన, వ్యాయామ ఉపాధ్యాయులు ప్రవీణ్ కుమార్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

షీటీం సేవలపై అవగాహన



మాట్లాడుతున్న పలువురు

నవతెలంగాణ-నసురుల్లాబాద్

నసురుల్లాబాద్ మండలంలోని బస్టాండ్ వద్ద ఆటో డ్రైవర్లకు గ్రామస్తులకు షీటీం సేవలపై అవగాహన కల్పించారు. గురువారం నసురుల్లాబాద్ మండల కేంద్రంలోని బస్టాండ్ వద్ద కామారెడ్డి జిల్లా ఎస్పీ సింధు శర్మ ఆదేశాల మేరకు షీ టీం సేవలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా విద్యార్థులపై హింస, ఈవ్‌టీజింగ్, సైబర్ క్రైంలకు ఎవరైనా గురైతే షీటీంలను సంప్రదించాలన్నారు. పదో తరగతి పిల్లలు పరీక్షల సమయంలో అప్రమత్తంగా ఉండాలని అపరిచిత వ్యక్తులకు నంబర్లు ఇవ్వకూడదని సూచించారు. ఏదైనా ఇబ్బంది తలెత్తితే డయల్ 100కు కాల్ చేయాలని సూచించారు. కార్యక్రమంలో షీటీం సభ్యులు అనిల్ కుమార్, ప్రియా గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ఎమ్మెల్సీ అభ్యర్థిని గెలిపించాలి

● అధ్యక్షులు వెంకట్ రెడ్డి

నవతెలంగాణ-తాడ్వాయి

కాంగ్రెస్ బలపరిచిన పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి డాక్టర్ నరేందర్‌రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షులు జూకంటి వెంకటరెడ్డి అన్నారు. గురువారం మండలంలోని కరేడ్పల్లి, దేమికలాన్, కన్కల్, చందాపూర్, సంఘజీవాడి గ్రామాల్లోని పట్టభద్రుల ఓటర్ల ఇండ్ల వద్దకు వెళ్లి.. సంవత్సరంలోపు 55 వేల ఉద్యోగాలు కాంగ్రెస్ ప్రభుత్వం భర్తీ చేసిందని, జాబు క్యాలెండర్ ప్రవేశపెట్టి నిరుద్యోగులకు అండగా ఉండే అభ్యర్థి నరేందర్ రెడ్డి అని ఓటర్లకు వివరిస్తూ ప్రచారం చేపట్టారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు షౌకత్ అలీ, ఓటర్లు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీలకు నిధులు విడుదల చేయాలి

నవతెలంగాణ-లింగంపేట్



వినతిపత్రాన్ని అందజేస్తున్న కార్యదర్శులు

గ్రామ పంచాయతీల్లో నిధులు లేక కార్యదర్శులు చాలా ఇబ్బందులకు గురవుతున్నామని వెంటనే పంచాయతీలకు నిధులను విడుదల చేసి కార్యదర్శులను ఆదుకోవాలని మండల ప్రత్యేక అధికారి సురేందర్‌కు కార్యదర్శులు గురువారం వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వచ్చే వేసవిని దృష్టిలో పెట్టుకుని పంచాయతీలకు నిధులను వెంటనే విడుదల చేయాలని, లేనిపక్షంలో మార్చి 1 నుంచి పంచాయతీలో విధులను బహిష్కరిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో నరేష్, కార్యదర్శులు అశ్వక్, రవికాంత్ తదితరులు పాల్గొన్నారు.

లింగంపల్లిలో ఎమ్మెల్సీ ఎన్నికలపై ప్రచారం

నవతెలంగాణ-లింగంపేట్

మండలంలోని లింగంపల్లి(ఖుర్దు) గ్రామంలో కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షులు బుర్ర నారగౌడ్ ఆదేశానుసారం గ్రామ కమిటీ అధ్యక్షులు ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారాన్ని గురువారం నిర్వహించారు. కాంగ్రెస్ బలపరిచిన పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా వి.నరేందర్‌రెడ్డి గెలుపు కోసం మీ అమూల్యమైన మొదటి ప్రాధాన్యత ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని తెలిపారు. పట్టభద్రుల వద్దకు వెళ్లి తమ అమూల్యమైన ఓటును వేయాలని ఓటర్లను వేడుకున్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షులు శేఖర్, అంజయ్య, సురేందర్, సతీష్, అనురాజ్, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

మహిళ సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక

నవతెలంగాణ-పిట్లం



ఎన్నికైన నూతన మహిళ కార్యవర్గం

మండలంలోని అల్లాపూర్ గ్రామ మహిళా సంఘం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నట్లు ఏపీవో శిరీష గురువారం తెలిపారు. గ్రామ మహిళా సంఘం అధ్యక్షురాలిగా మార్గం భారతి, ఉపాధ్యక్షురాలిగా నాగమణి, కార్యదర్శిగా సవిత బాయి, కోశాధికారిగా విజయలక్ష్మి, సహాయ కార్యదర్శిగా సావిత్రిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఆమె తెలిపారు. ఈ సందర్భంగా ఏపీవో శిరీష మాట్లాడుతూ.. నూతన మహిళా కార్యవర్గ సంఘం 3 సంవత్సరాల పాటు కొనసాగుతుందని, గ్రామ మహిళా సంఘాల అభ్యున్నతికి దోహదపడాలని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సంఘాల మహిళలు పాల్గొన్నారు.

ఉపాధి హామీ పనులు నిబంధనల ప్రకారం చేపట్టాలి



ఉపాధి హామీ పనులను పరిశీలిస్తున ఎంపీడీవో

నవతెలంగాణ-దోమకొండ

ఉపాధి హామీ పనులు నిబంధనల ప్రకారం చేపట్టాలని ఎంపీడీవో పూర్ణ చంద్రోదయ కుమార్ అన్నారు. గురువారం బిబిపేట్ మండలంలోని యాడారం, కోనాపూర్ గ్రామాలలో ఉపాధి హామీ పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఏపీవో రజిని, టెక్నికల్ అసిస్టెంట్ వినయ్, పంచాయతీ కార్యదర్శి భరత్, ఫీల్డ్ అసిస్టెంట్ అశోక్, సిబ్బంది పాల్గొన్నారు.

శ్రీ కాలభైరవ స్వామి ఆలయ టెండర్ నోటీస్

నవతెలంగాణ-రామారెడ్డి

మండలంలోని ఈసన్నపల్లి (రామారెడ్డి)లో వెలసిన శ్రీ కాలభైరవ స్వామి ఆలయానికి సంవత్సరం పాటు సామగ్రి అందజేయడానికి టెండర్ నోటీసును ఆలయ కార్యనిర్వాహణాధికారులు విడుదల చేశారు. 01.03.2025 నుంచి 28.04.2025 వరకు ఆలయానికి రాగి, వెండి పాదుకలు, చందనం, లామినేషన్ ఫోటోలు, కిరాణా సామాను, స్టిక్కర్స్ ప్యాకెట్ సైజ్, పేపర్ ఫోటోలు, వంట చెరుకు, ప్రింటింగ్‌కు సంబంధించిన కొటేషన్‌ను షీల్డ్ కవర్‌లో 22.02.2025 మధ్యాహ్నం 1 లోపు దేవాలయ కార్యాలయంలో అందజేయాలని, అదే రోజు మధ్యాహ్నం 3గంటలకు ఆలయ అధికారుల సమక్షంలో టెండర్ తీయబడునని, తక్కువ కొటేషన్ ఇచ్చినవారికి ఒక సంవత్సరం టెండర్ ఇవ్వబడునని ఆలయ కార్యనిర్వహణ అధికారి ప్రభువు రామచంద్రం తెలిపారు.

ప్రభుత్వ పాఠశాలలో వికలాంగుల దినోత్సవం



మాట్లాడుతున్న ఎంఈఓ పూర్ణచందర్

నవతెలంగాణ-రాజంపేట్(భిక్కనూర్)

రాజంపేట్ మండలంలోని తలమడ్ల గ్రామంలో గల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గురువారం ప్రపంచ వికలాంగుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓ పూర్ణచందర్ ప్రపంచ వికలాంగుల దినోత్సవం సందర్భంగా దివ్యాంగుల విద్యార్థులకు పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. సమాజంలో దివ్యాంగులను చిన్నచూపు చూడకుండా అందరితో సమానంగా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు బిక్షపతి, ఐఆర్‌పిసిఆర్‌పి, దివ్యాంగుల విద్యార్థులు ఉన్నారు.

ప్రకృతి వనాలపై సెక్రెటరీలు శ్రద్ధ వహించాలి

● ఎంపీఓ రాము



మాట్లాడుతున్న ఎంపీఓ రాము

నవతెలంగాణ-పిట్లం

పల్లె ప్రకృతి వనాలపై పంచాయతీ సెక్రటరీలు శ్రద్ధ వహించాలని ఎంపీఓ రాము అన్నారు. గురువారం మండలంలోని కోమటి చెరువు తండా, గౌరారం తాండ గ్రామపంచాయతీలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండుతున్న ఎండలకు పల్లె ప్రకృతి వనంలోని మొక్కలు ఎండకుండా పంచాయతీ సెక్రటరీలు జాగ్రత్తలు వహించాలని, వైకుంఠ ధామం నిర్వహణ, కంపోస్టు షెడ్‌లలో ఎరువుల తయారీని సక్రమంగా నిర్వహించాలని సూచించారు. 100 మొక్కల నిర్వహణ బాధ్యతలో భాగంగా మొక్కలను సంరక్షించాలని, క్రమం తప్పకుండా నీటిని అందించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సెక్రెటరీలు, సిబ్బంది పాల్గొన్నారు.

నీటి సమస్య పరిష్కారంలో కార్యదర్శులు

నవతెలంగాణ-భిక్కనూర్

మండలంలోని ఇసన్నపల్లి, కాచాపూర్, కంచర్ల, పెద్ద మల్లారెడ్డి ఆయా గ్రామాలలో వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకొని గ్రామ ప్రజల నీటి కష్టాలను తీర్చడానికి పంచాయతీ కార్యదర్శులు చెడిపోయిన మోటార్లను బాగు చేయించే పనిలో నిమగ్నమయ్యారు. గ్రామస్తులు నీటిని పొదుపుగా వాడాలని, వృథాగా పోతున్న మంచినీటి పైపులను ట్యాప్ కనెక్షన్ ద్వారా వృథాగా పోకుండా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, పంచాయతీ సిబ్బంది ఉన్నారు.

మద్దికుంట ఆలయ జాతరకు రావాలని ఆహ్వానం

నవతెలంగాణ-రామారెడ్డి

మండలంలోని మద్దికుంటలో వెలిసిన శ్రీ స్వయంభుబుగ్గ రామలింగేశ్వర స్వామి ఆలయంలో శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని నిర్వహించే జాతరకు ఆహ్వాన పత్రికను సిఐ రామనకు, ఎస్సై నరేష్‌కు ఆలయ కమిటీ గురువారం జిల్లా పరిషత్ మాజీ ఫ్లోర్ లీడర్ నారెడ్డి మోహన్‌రెడ్డితో కలిసి అందజేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు వడ్ల లింగమాచారి, మండల ఓబీసీ సెల్ అధ్యక్షులు బండి ప్రవీణ్, కాంగ్రెస్ నాయకులు దుంపల బాలరాజు, సంజీవరెడ్డి తదితరులున్నారు.

ప్రతినెలా వైద్య పరీక్షలు నిర్వహించుకోవాలి

నవతెలంగాణ-రాజంపేట్ (భిక్కనూర్)

గర్భిణులు ప్రతినెల క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు నిర్వహించుకోవాలని మెడికల్ అధికారి విజయ మహాలక్ష్మి తెలిపారు. గురువారం రాజంపేట్ పట్టణ కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అమ్మ ఒడి కార్యక్రమంలో భాగంగా గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో వైద్యులు సంగీత, ఐశ్వర్య, హెల్త్ సూపర్‌వైజర్ మంజూరు, గంగామని, ఏఎన్ఎం, ఆశావర్కర్లు, తదితరులు పాల్గొన్నారు.

మొక్కలు ఎండిపోకుండా జాగ్రత్తలు తీసుకోవాలి

● డిఎల్‌పిఓ శ్రీనివాస్

నవతెలంగాణ-భిక్కనూర్



నర్సరీని పరిశీలిస్తున్న డిఎల్‌పిఓ

మొక్కలు ఎండిపోకుండా జాగ్రత్తలు తీసుకోవాలని డీఎల్పీఓ శ్రీనివాస్ తెలిపారు. గురువారం భిక్కనూర్ పట్టణ కేంద్రంలోని నర్సరీలోని మొక్కలను పరిశీలించారు. వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకొని ప్రతిరోజు మొక్కలకు నీళ్ల పోయాలని, మొక్కలు ఎండిపోకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. మండలంలోని ప్రతి గ్రామంలో పంచాయతీ కార్యదర్శులు గ్రామాలలో ప్రజలకు నీటి కష్టాలు లేకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో రాజ్ కిరణ్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి మహేష్ గౌడ్, పంచాయతీ సిబ్బంది, తదితరులున్నారు.

లక్ష్యాన్ని చేరుకోవడానికి అంగవైకల్యం అడ్డుకాదు

● ఎంఈఓ ఆనందరావు



మాట్లాడుతున్న ఎంఈఓ ఆనందరావు

నవతెలంగాణ-రామారెడ్డి

లక్ష్యాన్ని చేరుకోవడానికి అంగవైకల్యం అడ్డు కాదని, దానిని అధిగమించి లక్ష్యాన్ని చేరుకోవాలని మండల విద్యాశాఖ అధికారి ఆనందరావు అన్నారు. గురువారం పీఎంశ్రీ పథకంలో భాగంగా మండల కేంద్రంలోని భవిత సెంటర్లో దివ్యాంగుల విద్యార్థులకు మానసిక స్థైర్యం పెంపొందించడానికి అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. భవిత సెంటర్ సేవలను గుర్తించి ఉపాధ్యాయురాలు సంజనను, అటెండర్ శోభను శాలువాతో సన్మానించారు. విద్యార్థులకు టిఫిన్ బాక్స్‌లతో పాటు, తీపి పదార్థాలు అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శివరాం, వైస్ ప్రిన్సిపాల్ సురేందర్‌రెడ్డి, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

వ్యాధులు గుర్తించడంపై సమావేశం

నవతెలంగాణ-భిక్కనూర్

భిక్కనూర్ పట్టణ కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వ్యాధులను ఏ విధంగా గుర్తించాలో వైద్య సిబ్బందికి గురువారం అవగాహన సమావేశాన్ని మెడికల్ అధికారి దివ్య నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. నాన్ కమ్యూనికేబుల్ డిసీజ్ అయిన మధుమేహం, రక్తపోటు, నోటి క్యాన్సర్, రొమ్ము క్యాన్సర్, గుర్తించడానికి 30 సంవత్సరాలు పైబడిన వారిని పరీక్షించాలని 40 రోజుల్లో 100శాతం వైద్య పరీక్షలు నిర్వహించాలన్నారు. హెచ్‌ఓ వెంకటరమణ, స్టాఫ్‌నర్స్, ఏఎన్ఎం, వైద్య సిబ్బంది తదితరులున్నారు.

సిద్దులగుట్టను దర్శించుకున్న మహబూబాబాద్ ఎమ్మెల్యే



నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణ కేంద్రంలోని ప్రసిద్ధిగాంచిన పుణ్యక్షేత్రం నవనాథ సిద్దుల గుట్ట ను మహబూబాబాద్ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే మురళి నాయక్ భూక్యా గురువారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ప్రొద్దుటూరు వినయ్ కుమార్ రెడ్డి , ఆలయ కమిటీ సభ్యులు స్వాగతం పలికారు. సిద్దేశ్వరుడు, రామాలయం దేవాలయాల దర్శనం చేయించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఆలయ చరిత్ర గురించి ఎమ్మెల్యేకు వివరించారు. ఆలయ చరిత్ర తెలుసుకొని సంతోషం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

పట్టణంలో పోలీసుల కవాతు



నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణంలోని జిరాయితనగర్ నుండి పెర్కిట్ వరకు పోలీసులు, రాపిడ్ యాక్షన్ ఫోర్స్ బృందం గురువారం కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణ అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ వెంకటేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ.. పట్టణంలో ఉన్న భౌగోళిక పరిస్థితులు, సామాజిక పరిస్థితులు, శాంతి భద్రతలు ఏ విధంగా ఉన్నాయని మాక్ డ్రిల్ నిర్వహించినట్టు తెలిపారు. ప్రజలందరూ కుల, మత, వర్గ భేదాలు లేకుండా, అందరూ సోదర భావంతో మెలగాలని సూచించారు. కార్యక్రమంలో స్టేషన్ హౌస్ ఆఫీసర్ సత్యనారాయణ, ఎస్సైలు ,పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పంటల క్రయవిక్రయాలను నిశితంగా పర్యవేక్షించాలి

- కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు
- రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని ఆదేశం

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

ఎర్రజొన్న, తెల్లజొన్న, పసుపు పంటల అమ్మకాలు ప్రారంభం అయినందున క్రయవిక్రయాలను నిశితంగా పర్యవేక్షణ జరపాలని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు అధికారులను ఆదేశించారు. పంట దిగుబడులను విక్రయించే విషయంలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. గురువారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని తన ఛాంబర్‌లో అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్‌తో కలిసి కలెక్టర్ వ్యవసాయ, ఉద్యానవన, మార్కెటింగ్ శాఖల అధికారులు, ట్రేడర్లు, విత్తన వ్యాపారులతో సమావేశం నిర్వహించారు. జిల్లాలో ప్రస్తుత సీజన్ లో సాగు చేసిన జొన్న, పసుపు పంటల విస్తీర్ణం, పంట దిగుబడులు, ఎర్రజొన్న రైతులతో ఆయా కంపెనీల వ్యాపారులు కుదుర్చుకున్న ఒప్పందం, స్వేచ్ఛ విఫణిలో ఆయా పంటలకు లభిస్తున్న ధర, మార్కెట్ డిమాండ్ తదితర వివరాలను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. రైతులతో కుదుర్చుకున్న బైబ్యాక్ ఒప్పందానికి కట్టుబడి తెల్లజొన్న, ఎర్రజొన్న కొనుగోళ్లు జరగాలని, రైతులు బయట మార్కెట్లో ఎక్కువ ధరకు ఇతర ట్రేడర్లకు పంట అమ్ముకోవాలని భావిస్తే వారికి పూర్తి స్వేచ్ఛ ఇవ్వాలని సీడ్ వ్యాపారులకు సూచించారు. మార్చి 15వ తేదీ వరకు మార్కెట్‌కు జొన్న, పసుపు పంట దిగుబడులు తరలివచ్చే అవకాశాలు ఉన్నందున ఎలాంటి ఇబ్బందులకు తావులేకుండా సాఫీగా క్రయవిక్రయాలు జరిగేలా ప్రణాళికాబద్ధంగా కృషి చేయాలని అధికారులను ఆదేశించారు.

పసుపు పంటను బాగా ఆరబెట్టి తీసుకుని వచ్చేలా రైతులకు క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించాలని, తద్వారా పూర్తిస్థాయిలో వారు మార్కెట్ డిమాండ్ మేరకు ధర పొందవచ్చన్నారు. తేమ శాతం కారణంగా రైతులు నష్టపోకూడదని సూచించారు. మార్కెట్ యార్డుకు పసుపు నిల్వలను రైతులు తీసుకువచ్చిన వెంటనే జాప్యానికి తావులేకుండా వెంటవెంటనే తూకం జరిగేలా పర్యవేక్షణ చేయాలన్నారు. డైరెక్ట్ పర్చేస్ సెంటర్‌ల ద్వారా రైతులు పంటలు విక్రయించేలా చూడాలని తెలిపారు. క్రయవిక్రయాలకు సంబంధించి ఇది ఎంతో కీలక సమయం అయినందున జాగరూకతతో విధులు నిర్వర్తించాలని, ఏ దశలోనూ రైతులు నష్టపోకుండా, ఇబ్బందులకు గురికాకుండా అంకితభావంతో పని చేయాలని కలెక్టర్ హితవు పలికారు. సంబంధిత శాఖల అధికారులు పరస్పరం సమన్వయాన్ని పెంపొందించుకుని పంటల క్రయవిక్రయాలు సాఫీగా జరిగేలా చొరవ చూపాలన్నారు. పంట విక్రయించిన రైతులకు వెంటవెంటనే చెల్లింపులు జరిగేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఏవైనా సమస్యలు ఉంటే తక్షణమే తమ దృష్టికి తేవాలని సూచించారు. రైతులను మోసగించే చర్యలకు పాల్పడే వారిని ఎంతమాత్రం ఉపేక్షించబోమని, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ సమావేశంలో జిల్లా వ్యవసాయ అధికారి వాజిద్ హుస్సేన్, ఉద్యానవన శాఖ సంయుక్త సంచాలకులు శ్రీనివాస్, మార్కెటింగ్ శాఖ ఏడీ గంగవ్వ, ఏడీఏలు, ఏఓలు, పసుపు ట్రేడర్లు, విత్తన కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు

పౌష్టికాహారం ప్రాధాన్యతపై అవగాహన



మాట్లాడుతున్న కళాశాల ప్రిన్సిపాల్ చంద్రిక

నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణంలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ మహిళా గురుకుల డిగ్రీ కళాశాల నందు విద్యార్థులకు పౌష్టికాహారం- ప్రాధాన్యత అనే అంశంపై కార్యక్రమం నిర్వహించినట్లు కళాశాల ప్రిన్సిపల్ డా.ఎస్. చంద్రిక గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణ ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులు డాక్టర్ ఫిర్దోజ్ ఫాతిమా ఈ కార్యక్రమంలో పాల్గొని విద్యార్థులకు పౌష్టికాహారం యొక్క ప్రాధాన్యం గురించి వివరించారు. విద్యార్థులు ఎక్కువగా నీరు తాగాలని, ఆరోగ్యంగా ఉండాలని, వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని సూచించారు. వచ్చేది వేసవి కాలం కాబట్టి విద్యార్థులు తగిన జాగ్రత్తలు తీసుకొని ఆరోగ్యంగా ఉంటూ చక్కగా చదువుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ప్రభుత్వ ఆసుపత్రి సూపర్వైజర్ శాంతమ్మ , ఆనంద్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమాన్ని జంతు శాస్త్ర, వృక్షశాస్త్ర విభాగం వారి ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల హెల్త్ సూపర్వైజర్ సంతోషి, ఎన్ఎస్ఎస్ కో ఆర్డినేటర్ చైతన్య శాంతి, అధ్యాపకులు డా. శిరీష, ఉజ్మా నిషాత్, ఈ.వైష్ణవి , విద్యార్థులు పాల్గొన్నారు.

మహాధర్నాకు తరలిన న్యూడెమోక్రసీ కార్యకర్తలు

నవతెలంగాణ-ఆర్మూర్

రాష్ట్ర ప్రభుత్వం ఆరు గ్యారెంటీలను పూర్తిస్థాయిలో అమలు చేయాలని హైదరాబాద్ ఇందిరాపార్క్ వద్ద జరిగే మహాధర్నాకు గురువారం పట్టణం నుండి న్యూడెమోక్రసీ కార్యకర్తలు తరలి వెళ్లారు. ఈ సందర్భంగా సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ సబ్ డివిజన్ కార్యదర్శి సూర్య శివాజీ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఏర్పడి 14 నెలలు దాటిన పూర్తిస్థాయిలో 6 గ్యారెంటీలను అమ లు చేయడం లేదని, 420 ఎన్నికల హామీలను కూడా అమలు చేయాలని అన్నారు. విద్య, వైద్య సౌకర్యాలను పేద ప్రజలకు ఇవ్వాలని, ప్రభుత్వ జాబ్ క్యాలెండర్ విడుదల చేయాలని, నిరుద్యోగ భృతి చెల్లించాలని, బీడీ కార్మికులకు జీవన భృతి వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ఇందిరాపార్క్ వద్ద మహాధర్నా వేల మంది న్యూడెమోక్రసీ కార్యకర్తలతో నిర్వహించినట్టు తెలిపారు. తరలి వెళ్లిన వారిలో న్యూడెమోక్రసీ నాయకులు ప్రిన్స్, ప్రజ సంఘాల నాయకులు రాహుల్, కళ్యాణ్, హుస్సేన్, సాయి వందలాదిమంది కార్యకర్తలు తరలి వెళ్లారు.

మార్చి2న యుద్ధభేరిని విజయవంతం చేయండి



వాల్‌పోస్టర్‌లను ఆవిష్కరించిన నాయకులు

నవతెలంగాణ-కంఠేశ్వర్

సిపిఎస్, యుపిఎస్‌ను వ్యతిరేకిస్తూ మార్చి2 న హైదరాబాద్‌లో యుద్ధభేరి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని తెలంగాణ కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం ఎంప్లాయిస్ యూనియన్ నిజామాబాద్ జిల్లా అధ్యక్షులు కత్రి విక్రమ్ సింగ్ కోరారు. ఈ మేరకు గురువారం చందూర్, మోస్రా, బోధన్, కోటగిరి, రుద్రూర్ మండలాలలోని వివిధ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో, జూనియర్ కళాశాలల్లో అగ్రికల్చర్ యూనివర్సిటీ, చెరుకు, వరి పరిశోధన కేంద్రం రుద్రూర్ లో మార్చి 2 న హైదరాబాద్ ఇందిరా పార్క్ దగ్గర జరిగే యుద్ధభేరి మహా ధర్నా వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా విక్రమ్ సింగ్ మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం నూతన పెన్షన్స్ స్కీమ్‌ను రద్దు చేయ కుండా దానిస్థానంలో యూనిఫైడ్ పెన్షన్ స్కీమ్ ను తీసుకు రావడానన్ని తీవ్రంగా ఖండించారు. రాష్ట్ర ప్రభుత్వం తన ఎన్నికల మేనిఫెస్టోలో పొందు పర్చిన విధంగా సిపిఎస్‌ను రద్దు చేసి పాతపెన్షన్ విధానంను అమలుచేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షం లో భవిష్యత్తులో టిఎస్‌సిపిఎస్‌ఈయు ఆధ్వర్యంలో పోరాట కార్యక్రమాన్ని ఉధృతం చేస్తామని అన్నారు. మార్చి 2న ధర్నా చౌక్‌లో జరిగే యుద్ధభేరి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి దేవళ్ళ గోపాల్, కార్యనిర్వహక కార్యదర్శి రాములు, శ్రీనివాస్, రవితేజ, సంగీత, లత, సునీత, షేక్ ఈసా, పోశెట్టి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల ప్రతిభా ప్రదర్శన



ప్రదర్శనలో పాల్గొన్న విద్యార్థులు

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

సెయింట్ జేవియర్స్ పాఠశాలలో ప్రీ ప్రైమరీ విద్యార్థుల ప్రతిభా ప్రదర్శన గురువారం నిర్వహించారు. వారు ఆడుకునే ఆట వస్తువులతో వారికి ఉపయోగపడే వస్తువులు వారితో చేయించారు. వారిలో ఉన్న ప్రతిభను ప్రతిబింబించడమే లక్ష్యంగా వారి సమయాన్ని విద్యతోపాటు, నైపుణ్యాన్ని ప్రదర్శించే విధంగా విద్యార్థులతో ఈ ప్రతిభా ప్రదర్శనను ఏర్పాటు చేశారు. ఈ ప్రదర్శనలో పిల్లలు పెయింటిగ్స్, పూల దండగ మార్చడం, ఇళ్లలో వంట గదిలో ఎలాంటి చిన్న చిన్న పనులు చేయడం, గణితాన్ని సులభంగా నేర్చుకోవడం, తప్పులు లేకుండా ఇంగ్లీష్‌లో ఎలా మాట్లాడాలో వారు నేర్చుకున్నది ప్రదర్శించారు. ప్రీప్రైమరీ స్థాయి విద్యార్థుల్లో మాంట్వేసరి విద్యా విధానం తెలియజేసి బోధించడమే మా విధానమని పాఠశాల చైర్‌పర్సన్ పి.నరసింహారావు, ప్రిన్సిపల్ లత తెలిపారు.

ఒకరికి ఒకరు సహకరించుకున్నప్పుడే

అందరికీ సామాజిక న్యాయం సాధ్యం

- జిల్లా న్యాయ సేవాధికారుల సంస్థ కార్యదర్శి సీనియర్ సివిల్ న్యాయమూర్తి పద్మావతి

నవతెలంగాణ-కంఠేశ్వర్

ఒకరికి ఒకరు సహకరించుకొని ముందుకు సాగినప్పుడే అందరికీ సామాజిక న్యాయం సాధ్యమవుతుందని ప్రముఖ వక్తలు పేర్కొన్నారు. గురువారం నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని స్నేహ సొసైటీ ఫర్ రూరల్ రీ కన్స్ట్రక్షన్ దివ్యాంగుల పాఠశాలలో ప్రపంచ సామాజిక న్యాయ దినోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జిల్లా న్యాయ సేవాధికారుల సంస్థ కార్యదర్శి సీనియర్ సివిల్ న్యాయమూర్తి పద్మావతి, ప్రముఖ మానసిక వైద్య నిపుణులు డాక్టర్ ఆకుల విశాల్, స్నేహ సొసైటీ సభ్యులు తాటి వీరేశం , బివి రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..ప్రతి ఒక్కరు సేవా తత్వాన్ని అలవర్చుకోవాలని సూచించారు. కుల మత లింగ దివ్యాంగ తారతమ్యాలు లేకుండా అందరికీ సమన్యాయం జరగడమే సామాజిక న్యాయమని వారు తెలియజేశారు. సామాజిక న్యాయం కోసం డెన్మార్క్ లో 1995లో చర్చించారన్నారు. 2005 నవంబర్ 26న మరలా చర్చించగా 2009 ఫిబ్రవరి 20వ తేదీ సామాజిక న్యాయం అమల్లోకి వచ్చిందని తెలియజేశారు. సామాజిక న్యాయం అనేది ఒకరితో సాధ్యమయ్యేది కాదని ప్రతి ఒక్కరు తమకు తోచిన విధంగా ఎదుటి వారికి సహాయం చేయాలనే ఆలోచనతోనే సామాజిక న్యాయం అనేది జరుగుతుందని తెలిపారు. మానసిక వైద్య నిపుణులు డాక్టర్ ఆకుల విశాల్ మాట్లాడుతూ.. మానసిక దివ్యాంగ విద్యార్థుల ఆరోగ్య దృష్ట్యా హెల్త్ ఇన్సూరెన్స్ కార్డు అనేది చేయించడం ఎంతో హర్షించదగ్గ విషయం అన్నారు.. గర్భిణీ స్త్రీలు పౌష్టికాహారం తీసుకోవడంలో నిర్లక్ష్యం వహించడం వల్ల బుద్ధిమాంద్యం, మానసిక ఇతరత్రా వ్యాధుల బారిన పడుతున్నారని తెలిపారు. అనంతరం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి సీనియర్ సివిల్ న్యాయమూర్తి పద్మావతి మాట్లాడుతూ.. సమాజంలో కుల మత వర్గ దివ్యాంగ వివక్షతలు లేకుండా అందర్నీ సమానంగా చూడడం మొదలు పెట్టినప్పుడే సామాజిక న్యాయం అందరికీ చేకూరుతుందని తెలిపారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో హక్కుల గురించి సామాజిక న్యాయం, పిల్లలకు, పెద్దలకు, మహిళలకు ఎలాంటి హక్కులు వర్తిస్తాయో న్యాయస్థానం ఏ విధంగా సహకరిస్తుందో ప్రతి గ్రామాన తెలిజేస్తున్నట్టు తెలిపారు. అనంతరం కార్యక్రమంలో విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలకు శాలువా జ్ఞాపిక తో ఘనంగా సన్మానించారు. న్యాయమూర్తి పద్మావతి డాక్టర్ ఆకుల విశాల్, నారాయణరెడ్డి రమణారెడ్డి,తాటి వీరేశం, జీవన్ రావు, బాబా గౌడ్, విగ్నేష్ తదితరులను స్నేహ సొసైటీ కార్యదర్శి ఎస్ సిద్దయ్య, ప్రిన్సిపాల్ జ్యోతి శాలువా జ్ఞాపికతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మానసిక వికలాంగుల పాఠశాల ప్రిన్సిపాల్ రాజేశ్వరి, స్నేహ సొసైటీ సిబ్బంది ఉపాధ్యాయ బృందం పిల్లల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా న్యాయ సేవాధికారుల సంస్థ కార్యదర్శి సీనియర్ సివిల్ న్యాయమూర్తి పద్మావతి

ఆడపిల్లలను చదివించాలి

- సీడీపీఓ స్వర్ణ లత



బేటీ బచావో బేటీ పదావో కార్యక్రమంలో పాల్గొన్న సీడీపీఓ

నవతెలంగాణ-భీంగల్ రూరల్

మహిళ, శిశు, దివ్యాంగుల, వయోవృద్ధుల శాఖ, జిల్లా మహిళా, జిల్లా బాలల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో బేటీ బచావో బేటీ పఢావో పది సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా మండలంలోని గోన్ గోప్పుల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థినులకు అవగాహన కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీడీపీఓ స్వర్ణ లత మాట్లాడుతూ జాతీయ బాలిక దినోత్సవం వేడుకలు పురస్కరించుకొని ఆడపిల్లల యొక్క లింగ నిష్పత్తిని పెంచాలని, తగ్గుదలను, అరకట్టాలని అన్నారు. ఆడపిల్లలు, మగ పిల్లలు సమాజంలో సమానమని తెలుపుతూ ఇద్దరికి కూడా సమాన హక్కులు ఉన్నాయని తెలిపారు. శిశు భ్రూణ హత్యల గురించి వివరించారు. ఆడపిల్లల ప్రాముఖ్యత ఎందుకు తగ్గుతుందంటే చిన్నతనంలోనే పెళ్లిళ్లు చేయడం ద్వారా భ్రూణ హత్యలకు పాల్పడడం ద్వారా అఘాయిత్యాల వల్ల ఆడపిల్లలు, పసిపిల్లల మరణాలు ఎక్కువయ్యాయని వివరించారు. సూపర్వైజర్ శారద, సౌమ్య, స్వప్న ప్రొజెక్టర్ ద్వారా బాల్య వివాహాల వల్ల కలిగే నష్టాల గురించి, వాటిని అధిగమించిన వాళ్ళు సాధించిన విజయాల గురించి వివరించారు. కార్యక్రమంలో సాధన సంస్థ కమ్యూనిటీ సోషల్ మొబలైజర్ నిరీక్షణ, ప్రధానోపాధ్యాయు శ్రీనివాస్, ఉపాధ్యాయ బృందం, పోషణ అభియాన్ ప్రశాంత్, అంగన్వాడీ టీచర్స్ ప్రమీల, పుష్ప, రాంకబాయ్ పాల్గొన్నారు.

రైతన్నల సంక్షేమాన్ని విస్మరించిన ప్రభుత్వం

- బీఆర్ఎస్ నాయకులు
- సిండికేట్‌గా మారిన జొన్నల వ్యాపారులపై, పసుపునకు మద్దతు ధర లేకపోవడంపై సమావేశం

నవతెలంగాణ-(వేల్పూర్)ఆర్మూర్

రైతన్నల సంక్షేమాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం విస్మరించిందని డిసిసిబి డైరెక్టర్ శేఖర్ రెడ్డి, బి.ఆర్ పార్టీ మండల అధ్యక్షుడు జైడి నాగదర్‌రెడ్డి, రైతు నాయకులు మిట్టపల్లి మైపాల్ రెడ్డి అన్నారు. గురువారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. జొన్నలకు వ్యాపారులు సిండికేట్గా మారి ధరలు తగ్గించడం, పసుపుకు మద్దతు ధర లేకపోవడం గురించి ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. నిజామాబాద్ గంజిలో పసుపు రైతులు ఆందోళన చేస్తున్న ఎవరు పట్టించుకుంటలేరని, అధికారులు స్పందించడంలేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. రాహుల్ గాంధీ ఇచ్చిన మాట ప్రకారం కాంగ్రెస్ పార్టీ వరంగల్ రైతు డిక్లరేషన్ ప్రకారం ప్రభుత్వం రైతుల నుంచి కొనుగోలు చేసి మద్దతు ధర ఇవ్వాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు పసుపు రైతు అంటే చిన్నచూపని, జొన్నలు, పసుపు ప్రభుత్వం కొనుగోలు చేయాలని కోరారు. లేదంటే బీఆర్ఎస్ పార్టీ రైతులతో కలిసి పెద్ద ఎత్తున ఆందోళన నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు ప్రతాపరెడ్డి, రేగుల్ల రాములు, నల్ల రమేష్‌రెడ్డి, నోముల రవీందర్, ఏలేటి చిన్నారెడ్డి, మెడిదపల్లి బాలకిషన్, పిట్లా సత్యం, మొండి అశోక్, మున్నూరు బాలయ్య పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు

ఇటుక బట్టి యజమానులపై చర్యలు తీసుకోవాలి

- సిపిఐ డిమాండ్



వినతిపత్రాన్ని అందజేస్తున్న సిపిఐ నాయకులు

నవతెలంగాణ-బాల్కొండ

మండల పరిధిలోని వివిధ గ్రామాలలో అనుమతులకు విరుద్ధంగా నడిపిస్తున్న ఇటుక బట్టి యజమానులపై, ప్రభుత్వ పథకాలు లబ్ధి పొందుతూ తమ వ్యవసాయ భూములను ఇటుక బట్టి పరిశ్రమలకు అద్దెకిచ్చిన భూ యజమానులపై చట్టరిత్య తగు చర్యలు తీసుకోవాలని సిపిఐ డివిజన్ కమిటీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా గురువారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ ఎమ్మార్వో ఏ.వనజకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిపిఐ నాయకులు మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రైతులకు రైతుబంధు, ఉచిత కరెంటు పథకాలు అందిస్తుందన్నారు. మండల పరిధిలోని పలు గ్రామాల్లో వ్యవసాయ క్షేత్రాలలో కొంతమంది రైతులు ఈ పథకాలను లబ్ధి పొందుతూ తమ భూములను ఇటుక బట్టి పరిశ్రమకు అద్దెకు ఇచ్చారని, ఆ భూముల యజమానులకు ప్రభుత్వ పథకాలు అందకుండా చూడాలని కోరారు. ప్రభుత్వ పథకాలు లబ్ధి పొందుతూ ప్రభుత్వాన్ని తప్పుదోవ పట్టిస్తున్న భూ యజమానులపై చర్యలు తీసుకోవాలని, అలాగే అనుమతులకు విరుద్ధంగా నడిపిస్తున్న ఇటుక బట్టీ యజమానులపై చర్యలు తీసుకోవాలని వారు కోరారు. కార్యక్రమంలో సిపిఐ డివిజన్ కమిటీ నాయకులు సోమశ్రీను, ఎం.నరేష్, డి.రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి

- పిడిఎస్‌యు

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని పిడిఎస్‌యు డిమాండ్ చేసింది. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అవలంభిస్తున్న విద్యా వ్యతిరేక చట్టాలు, నిర్ణయాలపైన గురువారం గిరిరాజ్ ప్రభుత్వ కళాశాలలో పిడిఎస్‌యు కళాశాల కమిటీ ఆధ్వర్యంలో ప్రతి తరగతికి వెళ్లి విద్యార్థులకు తెలియజేశారు. ఈ సందర్భంగా గిరిరాజ్ కళాశాల కమిటీ కార్యదర్శి నసీర్ మాట్లాడుతూ.. తెలంగాణలో విద్యాశాఖ మంత్రి నియమించాలని డిమాండ్ చేశారు. దేశం బాగుపడాలన్న విద్యారంగాన్ని బలోపేతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. అందుకు అనుగుణంగా రాష్ట్ర బడ్జెట్‌లో విద్యారంగానికి 30శాతం, కేంద్ర బడ్జెట్‌లో 10శాతం నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. పేద విద్యార్థులు చదువుకోవడానికి కారణమవుతున్న పెండింగ్ రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిర్లక్ష్యం వల్ల ప్రభుత్వ పాఠశాలలు శిథిలావస్థలో ఉంటే, పాఠశాల విద్యలో 5,8 తరగతులకు డిటెన్షన్ విధానం వల్ల చాలామంది పేద విద్యార్థులు దూరమయ్యే అవకాశం ఉందని తెలిపారు. వెంటనే డిటెన్షన్ విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. బడ్జెట్‌లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉద్యోగుల వేతనాలకే కాకుండా, విద్యాలయాల అభివృద్ధికి నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కళాశాల పిడిఎస్‌యు నాయకులు వినయ, శ్రావణి, అర్చన, తనుజి, నవీన్, రమ్య తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పిడిఎస్‌యు నాయకులు

ఆరు గ్యారెంటీలను అమలు చేయాలి

- మహాధర్నాకు తరలిన న్యూడెమోక్రసీ కార్యకర్తలు

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ



రాష్ట్ర ప్రభుత్వం ఆరు గ్యారెంటీలను పూర్తిస్థాయిలో అమలు చేయాలని, హైదరాబాద్ ఇందిరాపార్క్ వద్ద జరిగే మహాధర్నాకు నిజామాబాద్ నుంచి న్యూడెమోక్రసీ కార్యకర్తలు వందలాది మంది గురువారం వెళ్లారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ఏర్పడి 14 నెలలు దాటిన పూర్తిస్థాయిలో 6 గ్యారెంటీలను అమలు చేయడం లేదని, 420 ఎన్నికల హామీలను కూడా అమలు చేయాలని తెలిపారు. విద్య, వైద్య సౌకర్యాలను పేద ప్రజలకు ఇవ్వాలని, ప్రభుత్వ జాబ్ క్యాలెండర్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. తరలి వెళ్లిన వారిలో న్యూడెమోక్రసీ నాయకులు నీలం సాయిబాబా, శివకుమార్, జన్నారపు రాజేశ్వర్, సాయినాథ్, గంగాధర్, సాయిరెడ్డి, సత్యం, భారతి, దాసు, నర్సయ్య కార్యకర్తలు వెళ్లారు.

బోర్గాంలో చైన్స్ స్నాచింగ్

- తొమ్మిదిన్నర గ్రాముల చైను లాకెళ్లిన గుర్తుతెలియని దుండగుడు

నవతెలంగాణ-కంఠేశ్వర్

నగరంలోని నాలుగవ పోలీస్ స్టేషన్ పరిధిలోగల బోర్గం గ్రామంలో ఓ మహిళ మెడలోంచి గుర్తుతెలియని వ్యక్తి 9:30 గ్రాముల బంగారు చైన్ ను లాక్కెళ్ళినట్లు నాలుగవ పోలీస్ స్టేషన్ ఎస్ఐ శ్రీకాంత్ గురువారం తెలిపారు. ఎస్సై శ్రీకాంత్ తెలిపిన వివరాల ప్రకారం బోర్గాం గ్రామానికి చెందిన కళావతి అనే వృద్ధురాలు ఇంటి ఆవరణంలో కూర్చుని ఉండగా గుర్తు తెలియని వ్యక్తి ద్విచక్ర వాహనంపై వచ్చి మెడలో ఉన్న తొమ్మిదిన్నర గ్రాముల చైన్లు లాక్కెళ్లాడు. ఆమె కుమారుడు సుంకరి హనుమాన్లు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని నాలుగవ పోలీస్ స్టేషన్ ఎస్ఐ శ్రీకాంత్ తెలిపారు.

బర్డ్ ఫ్లూ కేసులు ఎక్కడా లేవు

- వెటర్నరీ అసిస్టెంట్ డైరెక్టర్ జియా ఉద్దీన్



నవతెలంగాణ-ఆర్మూర్

డివిజన్ పరిధిలో బర్డ్ ఫ్లూ కేసులు ఎక్కడా లేవని వెటర్నరీ అసిస్టెంట్ డైరెక్టర్ జియా ఉద్దీన్ గురువారం తెలిపారు. పట్టణంలోని ఏరియా వెటర్నరీ హాస్పిటల్‌లో ఆయన మాట్లాడుతూ. పౌల్ట్రీ ఫామ్ ల్లో కూడా ఎటువంటి కేసులు లేవని, వేడిలో చికెన్, గుడ్లు వండడం వల్ల బర్డ్ ఫ్లూ వైరస్ చనిపోతుందని డబ్ల్యూహెచ్ఓ కూడా ప్రకటించిందని తెలిపారు. బర్డ్ ఫ్లూ పై ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని అన్నారు.

నిర్భయంగా ఓటు హక్కు వినియోగించుకోండి

- ఆర్మూర్ ఏసిపి జే.వెంకటేశ్వర రెడ్డి

నవతెలంగాణ-బాల్కొండ

నిర్భయంగా ఓటు హక్కును వినియోగించుకోవాలని ఆర్మూర్ ఏసిపి జై వెంకటేశ్వర రెడ్డి ఓటర్లను కోరారు.ఎమ్మెల్సీ ఎన్నికలలో ప్రజలు స్వేచ్ఛ వాతావరణంలో ఓటు హక్కు వినియోగించుకునేలా ప్రజల్లో ధైర్యం కల్పించేందుకు ఏసిపి నేతృత్వంలో గురువారం మండల కేంద్రంలో రాపిడ్ యాక్షన్ ఫోర్స్, పోలీస్ లు కవాతు నిర్వహించారు. శాంతిభద్రతలకు ఎలాంటి విఘాతం కలగకుండా ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు తగిన భద్రత చర్యలు చేపట్టినట్లు ప్రజలకు విశ్వాసం కలిగించేందుకు స్థానిక పోలీసులతో కలిసి కేంద్ర బలగాలైన రాపిడ్ యాక్షన్ ఫోర్స్, పోలీసు సిబ్బంది కవాతు నిర్వహించినట్లు ఏసీపీ తెలిపారు. మండల కేంద్రంలో ఆర్మూర్ గల్లి బైపాస్ నుంచి గ్రామంలోని పుర వీధుల గుండా పోలీస్ కవాతు కొనసాగింది. ఈ కవాతులో రాపిడి యాక్షన్ ఫోర్స్ సిబ్బంది పెద్ద ఎత్తున పాల్గొన్నారు. బాల్కొండ ఎస్ఐ బి.నరేష్, ముప్కాల్ ఎస్ఐ రజినీకాంత్ తదితరులు ఉన్నారు.



మాట్లాడుతున్న ఏసీపీ వెంకటేశ్వరరెడ్డి

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో అశోక్ కుమార్‌కు సిపిఐ(ఎం) మద్దతు



మాట్లాడుతున్న జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్

నవతెలంగాణ-కామారెడ్డి

టీచర్‌గా పనిచేసి రిటైర్మెంట్ అయిన నిరాడంబరంగా జీవిస్తున్న వై అశోక్ కుమార్‌కు ఉపాధ్యాయ ఎన్నికల్లో మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని సీపీఐ(ఎం)పార్టీ జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్ ఉపాధ్యాయులకు విజ్ఞప్తి చేశారు. కామారెడ్డి జిల్లా కేంద్రంలోని ప్రెస్ క్లబ్ లో గురువారం భారత కమ్యూనిస్టు పార్టీ మార్క్సిస్టు (సిపిఐఎం) కామారెడ్డి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మిగతా ఇద్దరు అభ్యర్థులు కూడా ఒకరు రియల్ ఎస్టేట్ వ్యాపారి కాగా మరొకరు ప్రైవేట్ విద్యాసంస్థల అధిపతి అని అన్నారు. వీరు తమ ప్రయోజనాల కోసం వ్యాపారాల కోసం వస్తున్నారు తప్ప ప్రభుత్వ విద్యా విధానం అమలు కోసం ఉద్యమించేందుకు కాదన్నారు. ఉపాధ్యాయులు ఆలోచించి నిజాయితీగా ఉండే అశోక్ కుమార్‌ని గెలిపిస్తే ఓటు వేసిన మనకు విలువ ఉంటుందన్నారు. సమావేశంలో పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు వెంకట్ గౌడ్, మోతి రామ్ నాయక్, కొత్త నరసింహులు పాల్గొన్నారు.

కార్పొరేట్, ప్రైవేట్ కాలేజీలో అడ్మిషన్లపై చర్యలు తీసుకోవాలి

నవతెలంగాణ-బోధన్

విద్యా సంవత్సరం ప్రారంభం కాకముందే ప్రయివేటు, కార్పోరేట్ పాఠశాలలు, కళాశాలల్లో అడ్మిషన్‌లు చేస్తున్నారని వారిపై అధికారులు తక్షణమే స్పందించి చర్యలు తీసుకోవాలని ఏఐఎస్ఎఫ్ బోధన్ డివిజన్ ఇంచార్జ్ అంజలి పేర్కొన్నారు. గురువారం బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతోకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా అంజలి మాట్లాడుతూ.. కార్పొరేట్ ప్రయివేట్ జూనియర్ కాలేజీలో విద్యా సంవత్సరం పూర్తికాకముందే అడ్మిషన్ల పేరుతో విద్యార్థులు తల్లిదండ్రులకు, విద్యార్థులకు ప్రతి రోజు ఫోన్ చేసి ఇబ్బంది పెడుతున్నారన్నారు. వెంటనే స్పందించి అడ్మిషన్ నిర్వహిస్తున్న కార్పొరేట్, ప్రైవేటు జూనియర్ కాలేజీ, విద్యా సంస్థలపైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు జీవన్, అనిల్, రవి, అనిల్, శివకుమార్, రాములు, తదితరులు పాల్గొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటుకు అడ్డంకులు



ట్రాన్స్‌ఫార్మర్ కోసం ఏర్పాటుచేసిన దిమ్మె

- కొందరు అడ్డగించడంతో ట్రాన్ ఫార్మర్ల బిగింపులో జాప్యం

నవతెలంగాణ -ధర్పల్లి

మండల కేంద్రంలో తరచూ విద్యుత్ లోవోల్టేజి సమస్యతో, వ్యాపారులకు, ప్రభుత్వ, ప్రవేటు కార్యాలయాలతో పాటు ప్రజలకు అనేక ఇబ్బందులు ఎదురవుతున్నాయి. దీన్ని దృష్టిలో పెట్టుకొని విద్యుత్ అధికారులు మండల కేంద్రవా సులకు విద్యుత్ సమస్య శాశ్వతంగా పరిష్కరించేందుకు ఉన్నత అధికారులకు అదనంగా 5 కొత్త ట్రాన్స్ ఫార్మర్లు కావాలని నివేదికలు పంపించారు. స్పందించిన అధికారులు రెండు ట్రాన్స్ ఫార్మర్లు మంజూరు చేశారు. దీంతో స్థానిక విద్యుత్ అధికారులు వాటిని తరచూ సమస్య వస్తున్న ప్రాంతాల్లో ఏర్పాటు చేసేందుకు పూనుకున్నారు . అయా ప్రాంతాల్లో దిమ్మెలు సైతం నిర్మించి ట్రాన్స్ ఫార్మర్లు ఏర్పాటుకు సిద్ధంగా ఉంచారు. ఆయా ప్రాతాల్లోని కొందరు గ్రామస్తులు ట్రాన్స్ ఫార్మర్లు అక్కడ పెట్టవద్దని వ్యతిరేకిస్తున్నట్లు తెలిసింది. గ్రామస్తులు సహకారం అందించాలని విద్యుత్ అధికారులు కోరుతున్నారు. నూతన ట్రాన్స్ ఫార్మర్లు ఏర్పాటుకోసం లక్షలు ఖర్చు అవుతాయని, ప్రభుత్వం తరపున ఏర్పాటుకు ముందుకు వస్తే అడ్డగించడం సబబు కాదని కొందరు గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండల కేంద్రానికి 5 ట్రాన్స్ ఫార్మర్లు రానున్నట్లు తెలిసింది. అడ్డుకుంటే నష్టపోవలసి వస్తుందని గ్రామస్తులు అంటున్నారు.

అదనపు ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు



ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేసిన అధికారులు

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండలంలోని చౌట్‌పల్లి విద్యుత్ ఉపకేంద్రంలో సమ్మర్ యాక్షన్ ప్లాన్‌లో భాగంగా అదనపు ట్రాన్స ఫార్మర్ ఏర్పాటు చేసినట్లు ట్రాన్స్కో మోర్తాడ్ డీఈఈ వెంకటనారాయణ తెలిపారు. వేసవిలో విద్యుత్‌ను ఎలాంటి ఇబ్బందులు లేకుండా నిరంతరాయంగా అందించే దిశలో చౌట్ పల్లి విద్యుత్ ఉపకేంద్రంలో అదనపు ట్రాన్స్‌ఫార్మర్ గురువారం బిగించినట్లు ఆయన తెలిపారు. ప్రస్తుతం ఉన్న 5ఎంవిఎ పవర్ ట్రాన్స ఫార్మర్‌కు అదునంగా 3.1ఎంవిఎ పవర్ ట్రాన్స ఫార్మర్ ఏర్పాటు చేసి, బిగించినట్లు ఆయన వివరించారు. వేసవిలో ఉపకేంద్రం పరిధిలోని గ్రామాల ప్రజలకు ఎలాంటి విద్యుత్ అంతరాయం ఉండదని ఆయన స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఏడిఇలు వినోద్, నటరాజ్, బషీరాబాద్ ఏఈ కిషన్, తదితరులు పాల్గొన్నారు.

చిల్డ్రన్ పార్కును ప్రారంభించిన మల్టీ జోన్ వన్ ఐజి




నిఘాకెమెరాలను ప్రారంభించిన ఐజీ చంద్రశేఖర్‌రెడ్డి

నవతెలంగాణ-కామారెడ్డి

కామారెడ్డి జిల్లాలోని దేవునిపల్లి పోలీస్ స్టేషన్ ఆవరణంలో కామారెడ్డి ఎస్పీ సింధు శర్మ ప్రత్యేక కృషి తో ఏర్పాటు చేసిన చిల్డ్రన్ పార్కును గురువారం మల్టీ జోన్ వన్ ఐజి చంద్రశేఖర్ రెడ్డి ఐపీఎస్ ప్రారంభించరు. పిఎస్ నందు ఒక మొక్క నాటారు. ఈ కార్యక్రమంలో కామారెడ్డి ఎస్పీ సింధు శర్మ ఎఎస్పి బీ చైతన్య రెడ్డి, రూరల్ సీఐ రామన్, దేవనపల్లి ఎస్ఐ రాజు, పోలీస్ స్టేషన్ సిబ్బంది, చిన్న పిల్లలు పాల్గొన్నారు.

కామారెడ్డి పట్టణ పోలీసు స్టేషన్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన (100) నిఘా కెమెరాలను మల్టీ జోన్-1 ఐజిపి చంద్రశేఖర్ రెడ్డి, ఐపీఎస్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కామారెడ్డి పట్టణ ప్రజల సహాయ సహకారంతో ఈ (100) నిఘా కెమెరాలను ఏర్పాటుచేసుకున్నట్టు తెలిపారు. కెమరాల ద్వారా నేరస్తులు నేరాలు చేయడానికి భయపడుతారని అన్నారు. ఒకవేళ నేరం జరిగిన నేరస్తులను సి సి కెమరాల ద్వారా తొందరగా గుర్తించి పట్టుకోవచ్చున్నారు. తద్వారా సురక్షిత సమాజాన్ని ఏర్పరచుకోవచ్చు అన్నారు. ఈ (100) నిఘా కెమెరాల ఏర్పాటులో భాగస్వాములైన అందరికి ఐజిపి చంద్రశేఖర్ రెడ్డి, ఐపీఎస్ అభినందించారు. ఇకపై కూడా దాతలు, ప్రజలు ముందుకు వచ్చి కామారెడ్డి జిల్లా అంతటా ప్రతీ గ్రామం కవర్ అయ్యే విధముగా సి సి కెమరాలు ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు. కామారెడ్డి పట్టణ ఎస్‌హెచ్ఓ



చంద్రశేఖర్ రెడ్డిని సిబ్బందిని ప్రత్యేకంగా అభినందించారు.

పురుగు మందులు వాడే సమయంలో జాగ్రత్తలు తీసుకోవాలి

నవతెలంగాణ-రామారెడ్డి

పంట పొలాలకు పురుగుమందులు వాడే సమయంలో రైతులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని డాక్టర్ బ్రాండ్ కంపెనీ కామారెడ్డి ఏరియా మేనేజర్ ఎన్.నరేష్ రైతులకు సూచించారు. గురువారం మండలంలోని పోసానిపేట రైతు వేదికలో రైతులకు పంట పొలాల సాగు, సమస్యలపై, రసాయనిక ఎరువుల వాడకంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో గ్రామ రైతులు తదితరులు పాల్గొన్నారు.

గెలుపే లక్ష్యంగా పనిచేయాలి

ఎన్ఎస్‌యుఐ జిల్లా అధ్యక్షులు వేణురాజు

నవతెలంగా-కంఠేశ్వర్

ఎమ్మెల్సీ ఎన్నికల్లో నరేందర్ రెడ్డి గెలుపే లక్ష్యంగా ఎన్ఎస్‌యుఐ పనిచేయాలని జిల్లా అధ్యక్షులు వేణు రాశి పిలుపునిచ్చారు గురువారం జిల్లా కాంగ్రెస్ కార్యాలయం నందు (ఉమ్మడి నిజామాబాద్)నిజామాబాద్, కామారెడ్డి ఎన్ ఎస్ యు ఐ జిల్లా కమిటీల ఎమ్మెల్సీ ఎన్నికల సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఎమ్మెల్సీ ఎన్నికల కోసం పలువురు ఎన్ఎస్‌యుఐ నాయకులను ఉమ్మడి నిజామాబాద్ జిల్లా నియోజకవర్గ మండల స్థాయి కోఆర్డినేటర్లుగా నియమించారు. అనంతరం వేణురాజ్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి నరేందర్ రెడ్డి గెలుపే లక్ష్యంగా ఎన్ ఎస్ యు ఐ నూతనంగా నియమింపబడిన నియోజకవర్గ మండల స్థాయి కోఆర్డినేటర్లు ఎన్ఎస్‌యుఐ నాయకులు పనిచేయాలని అన్నారు. నూతనంగా నియమించిన నియోజకవర్గం మండల కోఆర్డినేటర్లు పట్టభద్రుల వద్దకు వెళ్లి ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి గెలుపు ఆవశ్యకతను వివరించాలని సూచించారు. నరేందర్‌రెడ్డి పైన బీజేపీ చేస్తున్న అబద్ధపు ప్రచారాన్ని తిప్పికొట్టాలని, ఆల్ఫోర్స్ విద్యాసంస్థల ద్వారా ఎంతో మంది విద్యార్థులకు విద్యను అందిస్తున్నాడని తెలిపారు. నరేందర్ రెడ్డి ఎమ్మెల్సీగా గెలిస్తే పట్టభద్రుల సమస్యల పట్ల పోరాటం చేస్తాడని, వారి గొంతుకగా నిలుస్తాడని ఆయన అన్నారు. ఎన్ ఎస్ యు ఐ నాయకులు నిబద్ధతో నరేందర్ రెడ్డి గెలుపు కొరకు పట్టభద్రుల వద్దకు వెళ్లి మొదటి ప్రాధాన్యత ఓటు వేయించే విధంగా ప్రచారం నిర్వహించాలని సూచించారు. గతంలో కేంద్రంలో బిజెపి ప్రభుత్వం సంవత్సరానికి రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని చెప్పిందని, ఆ లెక్కన ఇప్పడి వరకు 20 వేల కోట్ల ఉద్యోగాలు ఇవ్వాల్సి ఉండగా ఒక్క ఉద్యోగం కూడా ఇవ్వలేదని అన్నారు. ఇటు రాష్ట్రంలో టిఆర్ఎస్ ఇంటికొక ఉద్యోగం అని నిరుద్యోగులను మోసం చేసిందని, కేంద్ర ప్రభుత్వం ద్వారా ఒక్క యూనివర్సిటీనీ ప్రారంభించలేదని, మెడికల్ కళాశాల నిర్మించలేదని ఆయన అన్నారు. ప్రతి ఒక్క



రంగాన్ని నిర్వీర్యం చేస్తూ వ్యవస్థలన్నింటినీ చిన్నాభిన్నం చేసిన ఘనత బీజేపీ, టిఆర్ఎస్ ప్రభుత్వాలదని ఆయన అన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం బీసీ కులగణన చేస్తున్న సందర్భంలో బీజేపీ నాయకులు దానిని అడ్డుకుంటున్నారని, ఎందుకు బీజేపీ నాయకులు దేశవ్యాప్తంగా కులగణన చేయడం లేదని ప్రశ్నించారు. కార్యక్రమంలో బోధన్ ఎన్ ఎస్ యు ఐ కో ఆర్డినేటర్ నరందీప్ చింటు, రూరల్ నియోజకవర్గ కో ఆర్డినేటర్ ఆశిష్, రమణ, ప్రణీత్ రెడ్డి, ప్రత్యూష్ కుమార్,కామారెడ్డి ఆఫ్రోజ్,ఎల్లారెడ్డి సమీర్, బాల్కొండ పృథ్వీ, రేవంత్ యాదవ్, ఆర్మూర్ బాశెట్టి శశి, అఖిల్, నికిల్, రాకేష్, కౌశిక్, హరీష్,శివ, గంగా ప్రసాద్,అభి, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి ఎద్దడి తలెత్తకుండా

ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలి

జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్

నవతెలంగాణ-కామారెడ్డి

త్రాగునీటి ఎద్దడి తలెత్తకుండా ముందస్తు ప్రణాలికలు సిద్ధం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ అన్నారు. గురువారం ఎల్లారెడ్డి మున్సిపల్ కార్యాలయంలో తాగునీరు, పారిశుధ్యం, పన్నుల వసూళ్ల తదితర అంశాలపై కలెక్టర్ సంబంధిత అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, వచ్చే వేసవి కాలంలో పట్టణ ప్రజలకు త్రాగునీటి సమస్యలు తలెత్తకుండా ప్రతీరోజూ నిరంతర నీటి సరఫరా అయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని అన్నారు. అవసరమైన పక్షంలో బోర్ వెల్స్ మరమ్మత్తులు చేయించాలని తెలిపారు. పట్టణంలో చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని తెలిపారు.



భోజన సమయంలో విద్యార్థులతో కలిసి ప్రార్థన చేస్తున్న కలెక్టర్

పట్టణంలో పారిశుధ్య కార్యక్రమాలు నిరంతరం కొనసాగించాలని తెలిపారు. ఇంటింటి చెత్త సేకరణ ప్రతీ రోజూ నిర్వహించాలని, సేకరించిన చెత్తను డంపింగ్ యార్డ్ కు తరలించాలని తెలిపారు. డంపింగ్ యార్డ్ లో సెగ్రిగేషన్ షేడ్ లో విడివిడిగా సెగ్రిగేట్ చేయాలని తెలిపారు. 12 వార్డ్ లలోని చెత్తను 7 వాహనాల ద్వారా చెత్త సేకరణ చేపడుతున్నామని మున్సిపల్ సిబ్బంది కలెక్టర్ కు వివరించారు. పారిశుధ్య సిబ్బంది వేతనాలు సక్రమంగా చెల్లించాలని, ఈ.పి.ఎఫ్., ఈఎస్ఐ చెల్లించాలని తెలిపారు. అనంతరం మిషన్ భగీరథ, అమృత్ పథకం క్రింద చేపడుతున్న పనులపై సంబంధిత ఇంజనీరింగ్ అధికారులతో సమీక్షించారు. లీకేజీలను సత్వరమే మూసివేయాలని తెలిపారు.మున్సిపల్ పరిధిలో నాటిన మొక్కలకు వాటరింగ్ నిర్వహించి సంరక్షించాలని తెలిపారు. అనంతరం డి.ఆర్.సి.సి. కేంద్రం, సెగ్రిగేశన్ షేడ్ లను కలెక్టర్ పరిశీలించారు. కంపోస్టు ఎరువును వినియోగంలోకి తీసుకురావాలని తెలిపారు. డంపింగ్ యార్డ్ ల నిర్వహణ సక్రమంగా నిర్వహించాలని తెలిపారు. అనంతరం తెలంగాణ గిరిజన సంక్షేమ శాఖ బాలికల రెసిడెన్షియల్ జూనియర్ కళాశాల ను కలెక్టర్ సందర్శించి, పదవ తరగతి విద్యార్థుల చదువు, వార్షిక పరీక్షల సన్నద్ధత, భోజనం తదితర అంశాలపై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. గత సంవత్సరం ఉత్తర్ణత శాతం వివరాలు అడిగారు. ఈ సంవత్సరం కూడా వంద శాతం ఉత్తీర్ణత శాతం సాధించాలని తెలిపారు. పరీక్షల నేపథ్యంలో ఒత్తిడికి లోనుకాకుండా ఉండాలని తెలిపారు. వచ్చే సంవత్సరం ట్రిపుల్ ఐటీ లో సీటు సాధించాలని సూచించారు. విద్యార్థులతో శానిటేషన్ పోస్టర్ ను , మాథ్స్, ఫిజికల్ సైన్స్ కు సంబంధించిన వాటిపై విద్యార్థులను అడిగి బోర్డుపై జవాబు రాబట్టారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ ప్రభాకర్, మున్సిపల్ కమీషనర్ రమేష్, తహసీల్దార్ మహేందర్, ఇన్చార్జి ఎంపీడీఓ ప్రకాష్, పలు శాఖల అధికారులు, ఇంజనీరింగ్ అధికారులు, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. అనంతరం విద్యార్థులతో కలిసి కలెక్టర్ భోజనం చేశారు.